





ప్రవీణ్‌కుమార్‌రెడ్డి | శంకర్ యాదవ్ | దొరస్వామినాయుడు | శ్రీరామ్ చినబాబు | నరసింహారెడ్డి | కొండా నరేంద్ర

తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జ్ ఎవరో?

● ఆశావహుల జాబితా పెద్దదే ● అధిష్టానం కటాక్షం ఎవరికో?

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్‌గా ఉన్న జయచంద్రారెడ్డి నకిలీ మద్యం ఆరోపణలతో పార్టీ నుంచి సస్పెండ్ కావడంతో ప్రస్తుతం ఆ పదవి ఎవరికి దక్కుతుందో అనే చర్చ ఆ నియోజకవర్గంలో మాత్రమే కాకుండా జిల్లావ్యాప్తంగా నడుస్తోంది. కూటమి ప్రభుత్వానికి ఇంకో మూడు సంవత్సరాలకు పైగా పదవీకాలం ఉండడంతో ఈ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పదవికి పోటీ విపరీతంగా ఉంది. ఇన్‌చార్జ్ పదవిని ఆశిస్తున్న ఆశావహుల జాబితా కూడా పెద్దదిగానే ఉంది. ఈ ఆశావహుల్లో టీడీపీ నాయకులే కాక బీజేపీ వాళ్లూ ఉన్నారు. ఈ పదవిని ఆశిస్తున్న నాయకులు, అధిష్టానాన్ని ప్రసన్నం చేసుకునేందుకు తమ ప్రయత్నాల్లో తాము ఉన్నారు. తమకు అవకాశం కల్పించాలని తమకు తెలిసిన మంత్రులు, రాష్ట్ర పార్టీ నాయకులను కలుస్తున్నారు. తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే జి.శంకర్‌యాదవ్, ఏవీ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మదనపల్లెకు చెందిన రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు, తంబళ్లపల్లె నియోజకవర్గ యువనేత కట్టా దొరస్వామినాయుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త కొండా నరేంద్ర, మలిగి మధుసూదన్‌రెడ్డి, బి.కొత్తకోటకు చెందిన రాష్ట్ర నాయకురాలు పర్వీన్‌తాజ్, కురబలకోటకు చెందిన రాజంపేట పార్లమెంటు బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్, బీసీ వర్గానికి చెందిన సీనియర్ నాయకులు వలిగట్ల వెంకటరమణతో పాటు బీజేపీ నుంచి చల్లపల్లె నరసింహారెడ్డిలు ఇన్‌చార్జ్ పదవిని ఆశిస్తున్నారు. ఇటీవల శంకర్ వర్గానికి చెందిన పలువురు నాయకులు రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను కలిసి తమ నాయకుడిని ఇన్‌చార్జ్‌గా ప్రకటించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌కుమార్‌రెడ్డి కూడా ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసినట్లు ప్రచారంలో ఉంది. యువనేత కట్టా దొరస్వామినాయుడు, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబులతో పాటు ఆశావాహులు పలువురు పార్టీ పెద్దలను కలిసి తమ బయోడేటాను సమర్పించినట్లు సమాచారం. కూటమి తరపున తనకు అవకాశం కల్పించాలని ఆ పార్టీ పెద్దలను బీజేపీ నాయకుడు చల్లపల్లె నరసింహారెడ్డి కోరినట్లు తెలిసింది. బీజేపీ నేత చల్లపల్లె నరసింహారెడ్డి కూటమి తరపున బీజేపీకి అవకాశం కల్పించాలని ఆ పార్టీ పెద్దలను కలిశారు.

ఆశావహుల బలాబలాలేంటి?

తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జ్ రేసులో ఉన్న వారి బలాబలాలు చూస్తే ఏవీ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి కుటుంబం ఎన్నో ఏళ్లుగా నియోజకవర్గ రాజకీయాల్లో కీలకంగా వ్యవహరించింది. ఆయన తండ్రి ఏవీ ఉమాశంకర్‌రెడ్డి ఎమ్మెల్సీగా పనిచేశారు. తల్లి ఏవీ లక్ష్మీదేవమ్మ ఎమ్మెల్యేగా పనిచేశారు. ఆయన కుటుంబానికి నియోజకవర్గంలో మంచి పట్టు, అనుచర వర్గం ఉంది. బీసీ కులానికి చెందిన శంకర్‌యాదవ్ గతంలో ఎమ్మెల్యేగా పనిచేశారు. నియోజకవర్గంలో ఆయనకు ప్రతి మండలంలో బలమైన అనుచర వర్గం ఉంది. గతంలో టీడీపీ ఇన్‌చార్జ్‌గా కూడా పనిచేశారు. 2024 ఎన్నికల్లో శంకర్‌ను పక్కన పెట్టి జయచంద్రారెడ్డికి పార్టీ టికెట్ ఇచ్చింది. కట్టా దొరస్వామినాయుడు ఎంసీఏ విద్యను అభ్యసించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మీదున్న అభిమానంతో 2008లో పార్టీలో చేరారు. తరువాత టీఎన్ఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కార్యదర్శిగా పనిచేసి 2014 ఎన్నికలకు ముందు మేనిఫెస్టోను నియోజకవర్గం మొత్తం గోడల మీద రాయించి ప్రజల్లోకి తీసుకెళ్లారు. కార్యకర్తలకు అందుబాటులో ఉన్నారు. బలిజ సామాజికవర్గానికి చెందిన కొండా నరేంద్ర ప్రముఖ పారిశ్రామికవేత్త. నియోజకవర్గంలో మొరుసు కాపుల తరువాత బలిజ సామాజిక వర్గం అత్యధికంగా ఉండడంతో ఇన్‌చార్జ్ పదవి కోసం జోరుగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. టీడీపీ రాష్ట్ర మైనార్టీ నాయకురాలు పర్వీన్‌తాజ్ పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్నారు. ఈమె సేవలు గుర్తించిన పార్టీ అధిష్టానం రాష్ట్ర కమిటీలో చోటు కల్పించడంతో పాటు డైరెక్టర్‌గా అవకాశం కల్పించింది. మొరుసు కాపు సామాజిక వర్గం నుంచి మలిగి మధుసూదన్‌రెడ్డి తనకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు. పీలేరు నియోజకవర్గానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, బీసీ వర్గానికి చెందిన వలిగట్ల వెంకటరమణ ఎన్నో ఏళ్లుగా టీడీపీ కోసం పనిచేస్తున్నారు. కురబలకోట మండలానికి చెందిన సురేంద్రయాదవ్ పార్టీలో చురుగ్గా పనిచేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఆయనపైన అనేక అక్రమ కేసులు పెట్టి వేధించింది. బీజేపీ సీనియర్ నేత చల్లపల్లె నరసింహారెడ్డి కూడా కూటమి తరపున ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. వీళ్లలో ఒకరిని నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ప్రకటిస్తారా? లేక కొత్తగా మరెవరినైనా తెర మీదకు తెస్తారా? అనేది వేచి చూడాల్సిందే.

పెద్దిరెడ్డిని ఎదుర్కొనేదెవరు?

తంబళ్లపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా పదవినైతే పలువురు ఆశిస్తున్నారు కానీ ఇప్పటికీ జిల్లాను రాజకీయంగా తన కనుసన్నల్లోనే ఉంచుకున్న పెద్దిరెడ్డి కుటుంబాన్ని ఎదుర్కొనేది ఎవరనే ప్రశ్న తలెత్తుతోంది. ఐదేళ్ల వైసీపీ పాలనలో జిల్లాలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హవా కొనసాగింది. ఇప్పటికీ చాలా నియోజకవర్గాలలో పెద్దిరెడ్డి పనులు ఎటువంటి అడ్డంకులు లేకుండా జరిగిపోతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి స్వయానా సోదరుడు. మొన్నటి వరకు ఉన్న జయచంద్రారెడ్డి పెద్దిరెడ్డి మనిషి అని టీడీపీ వర్గాలు ఆరోపిస్తున్నాయి. గత ఎన్నికల్లో ఆయన లోపాయికారీగా ద్వారకనాథరెడ్డి గెలుపునకు సహకరించారని ఇప్పటికీ నియోజకవర్గ వ్యాప్తంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. రాజకీయంగా పెద్దిరెడ్డి కుటుంబాన్ని తగిలే సత్తా ఉన్న వాళ్లనే నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమిస్తారనే ప్రచారం ఉంది.

మదనపల్లె సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం గోడకు అతికించిన టోల్‌ఫ్రీ నెంబర్ పోస్టర్



ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలకు చెక్

● ప్రతి కార్యాలయం వద్ద ఏసీబీ టోల్‌ఫ్రీ నెంబర్

మదనపల్లె టౌన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రజలకు పారదర్శక పాలన అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి అంశంలోనూ ముందడుగు వేస్తోంది. ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ సేవల కోసం వచ్చే ప్రజలను లంచాలు అడిగే అధికారులకు చెక్ పెట్టడానికి అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) వినూత్న అడుగులు వేస్తోంది. ఇది వరకు లంచాలు రూపుమాపేందుకు ఏసీబీ అధికారుల నెంబర్లను పత్రికా ప్రకటనల్లో మాత్రమే ఇచ్చేవారు. ఇప్పుడు ప్రతి ప్రభుత్వ కార్యాలయం వద్ద ఏసీబీ టోల్‌ఫ్రీ నెంబర్ పోస్టర్లను అతికిస్తున్నారు. ముఖ్యంగా తహసీల్దార్ కార్యాలయం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, సబ్ ట్రెజరీ వంటి కీలక శాఖల కార్యాలయాల వద్ద ఈ పోస్టర్లను అతికిస్తున్నారు. ఏ అధికారి అయినా ప్రజలను లంచాలు డిమాండ్ చేస్తే 1064 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చని రాశారు. దీంతో పాటు 0866 2428779 ల్యాండ్‌లైన్ నెంబర్, 9440440057 మొబైల్ ఫోన్ నెంబర్లకు కూడా ఫిర్యాదు చేయొచ్చని పోస్టర్లలో తెలిపారు. ప్రజలు కూడా వారిని లంచాలు అడిగే అధికారుల గురించి ఈ నెంబర్లకు ధైర్యంగా ఫోన్ చేసి చెబితేనే అవినీతి అధికారుల భరతం పట్టినట్లు అవుతుంది.

విదేశాల రోడ్లను తలపించేలా..

● మదనపల్లె-తిరుపతి రహదారిలో దూసుకుపోతున్న వాహనాలు



మదనపల్లె-వాల్మీకిపురం మధ్య సీటీఎం చెరువు వద్ద విశాలంగా కనిపిస్తున్న జాతీయ రహదారి

మదనపల్లె టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఈ చిత్రం చూశారా.. ఇదేదో అభివృద్ధి చెందిన విదేశాల్లో కనపడే జాతీయ రహదారి అనుకుంటే పొరపాటు పడినట్లే. ఇటీవల ప్రారంభించిన మదనపల్లె-తిరుపతి ఎన్‌హెచ్-71 నాలుగు లేన్ల జాతీయ రహదారి. మదనపల్లె నుంచి సీటీఎం చెరువు మీదుగా కొండను తొలచి నిర్మించిన ఈ రోడ్డుపై ప్రయాణించే వారికి కొత్త అనుభూతులు కనిపిస్తున్నాయి. నాలుగు లేన్ల జాతీయ రహదారి, ఇరువైపులా సర్వీసు రోడ్లతో విదేశాల్లో రోడ్లను తలపిస్తున్నాయి. 100 నుంచి 120 కిలోమీటర్ల వేగంతో సర్రున ప్రయాణిస్తున్న కార్లు మదనపల్లె నుంచి భాకరాపేట వరకు 72 కిలోమీటర్ల దూరాన్ని కేవలం 45 నిమిషాల్లో గమ్యం చేరుకుంటున్నారు.



నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

● కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి (నేతాజీ సర్కిల్), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రం రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మాక్ అసెంబ్లీకి మోడల్ స్కూల్ విద్యార్థిని



సుహానా

తంబళ్లపల్లె, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం నవంబరు 26న అమరావతిలో జరిగే మాక్ అసెంబ్లీకి నియోజకవర్గం నుంచి తంబళ్లపల్లె మోడల్ స్కూల్ విద్యార్థిని సుహానా ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ హేమంత్‌కుమార్ తెలిపారు. ఈనెల 1వ తేదీ అంగళ్లు ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు నియోజకవర్గ స్థాయిలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి 18 మంది విద్యార్థులు పాల్గొనగా ప్రతిభ చూపిన ముగ్గురు విద్యార్థులను ఎంపిక చేశారు. ఇందులో తంబళ్లపల్లె మోడల్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న ఎస్.సుహానా ద్వితీయ స్థానం సాధించి మాక్ అసెంబ్లీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థినిని ఎంఈఓలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు, ప్రిన్సిపాల్ హేమంత్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

హాస్టళ్లలో మెనూ పాటించండి

● ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

పులివెందుల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): హాస్టళ్లలో మెనూ తప్పకుండా పాటించాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని నగరిగుట్ట ఎస్టీ బాలికల వసతి గృహాన్ని అనంతరం ఏపీ గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ (ఏపీటీడబ్ల్యూఆర్) స్కూల్‌ను ఎమ్మెల్సీ పరిశీలించారు. ముందుగా ఎస్టీ బాలికల వసతి గృహాన్ని పరిశీలించి అక్కడ విద్యార్థులతో మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? ప్రభుత్వం చెప్పిన విధంగా అన్నీ అందిస్తున్నారా అని విద్యార్థులను ప్రశ్నించారు. అందుకు విద్యార్థులు మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని, పాలు మరీ పలుచగా చక్కెర లేకుండా ఇస్తున్నారని వివరించారు. బాత్‌రూములు సరిగా లేవని అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో ఎమ్మెల్సీ హాస్టల్ వార్డన్ సుజాతతో ఫోన్‌లో మాట్లాడారు. ఆర్వో వాటర్ ప్లాంట్‌ను మరమ్మతులు చేయించాలని, వర్షాకాలంలో విద్యార్థినిలకు వేడి నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

దేశ సమైక్యతకు యువత కీలక పాత్ర పోషించాలి

● భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా పురస్కారాలు అందుకుంటున్న ప్రముఖ రంగస్థల నటుడు గుమ్మడి గోపాలక్రిష్ణ, మేడసాని మోహన్, అనంత పద్మనాభ, అంకెగౌడ

కడప కల్చరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): దేశ సమైక్యతకు, విలువలు కాపాడుకోవడానికి నేటి యువత కీలకపాత్ర పోషించాలని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు సూచించారు. డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి (బ్రౌన్ శాస్త్రి) శతజయంత్యుత్సవం సందర్భంగా ఆదివారం ఉదయం కడప నగరం ఎర్రముక్కపల్లెలోని సీపీ బ్రౌన్ గ్రంథాలయం ఆవరణంలో 14వ సాహిత్య, గ్రంథాలయ సేవా పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సభకు అధ్యక్షుడిగా కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి వ్యవహరించగా, గౌరవ అతిథిగా కలెక్టరు చెరుకూరి శ్రీధర్ హాజరయ్యారు. అనంతరం సభనుద్దేశించి వెంకయ్యనాయుడు మాట్లాడుతూ ఒక విదేశీయుడు మన రాష్ట్రానికి వచ్చి తెలుగు భాషకు కృషి చేసినందుకు శత కోటి అభినందనలు తెలిపారు. మనం అడగకుండానే మనతో సహజీవనం చేస్తున్న ప్రకృతిని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, సహజ వనరులను సద్వినియోగం చేసుకుంటే ఆరోగ్యకరమైన జీవితం ఆస్వాదించవచ్చన్నారు. తెలుగుజాతికి విశిష్ట సేవలందిస్తున్న సీపీ బ్రౌన్ భాషా పరిశోధనా కేంద్ర గ్రంథాలయ అభివృద్ధిని కోరుతూ తన కుమార్తె నిర్వహిస్తున్న స్వర్ణభారతి ట్రస్టు నుంచి రూ.5 లక్షల విరాళాన్ని ప్రకటించారు. అనంతరం తెలుగుసాహితీ ప్రపంచంలో తనదైన ముద్ర వేసుకున్న ప్రముఖ రంగస్థల నటుడు గుమ్మడి గోపాలకృష్ణ, అవధాన ప్రముఖులు మేడసాని మోహన్, లక్షలాది గ్రంథాల సంరక్షకుడు మరె అంకెగౌడ, ప్రముఖ సాహితీవేత్త రేవూరు అనందపద్మనాభలకు పురస్కారాలు అందజేశారు. అలాగే 2025 పదో తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన కడప బాలవికాస్ పాఠశాల విద్యార్థులు గౌసియా, మీనా సహనా, ప్రదీప్‌కుమార్, గీతిక, రిహానాతో పాటు గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తూ గిన్నిస్‌బుక్ ఆఫ్ రికార్డులో స్థానం సాధించిన చిత్రకారుడు ఆనంద్‌రాజ్‌లను సత్కరించారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప, వైవీయూ వీసీ ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్, ఎస్‌బీఐ డిప్యూటీ జనరల్ మేనేజరు హేమ, జానమద్ది సాహితీ పీఠం నిర్వాహకుడు జానమద్ది విజయభాస్కర్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, కేఎంసీ కమిషనరు మనోజ్‌రెడ్డి, బ్రౌన్ గ్రంథాలయ సంచాలకురాలు పార్వతి, లైబ్రరీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివారం ఆటవిడుపు..

● క్రికెట్ పోటీలో పాల్గొన్న ఎస్పీ



బ్యాటింగ్ చేస్తున్న ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

వాల్మీకిపురం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): నిత్యం ఉద్యోగం.. బాధ్యతలు.. ప్రజల రక్షణ కోసమే రాత్రింబవళ్లు శ్రమించే పోలీసులు ఆదివారం ఆటవిడుపుగా క్రికెట్ ఆడారు. ఆదివారం జిల్లా నలుమూలల నుంచి పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బందికి క్రికెట్ ఆడటానికి జీవీఎస్‌సీఎస్ మైదానం వేదికైంది. ఉదయం 9.30 గంటలకు రాయచోటి పోలీస్ లెవెన్, మదనపల్లె పోలీస్ లెవెన్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరిగింది. టాస్ గెలిసి బ్యాటింగ్ ఎంచుకున్న రాయచోటి పోలీస్ లెవెన్ జట్టు 19.5 ఓవర్లలో 10 వికెట్లు కోల్పోయి 173 పరుగులు చేసింది. రాయచోటిలో జట్టులో ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆడారు. బ్యాటింగ్ చేసి 10 పరుగులు చేయడమే కాకుండా బౌలింగ్ చేసి ఒక వికెట్ కూడా తీశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన మదనపల్లె పోలీస్ లెవెన్ జట్టు 20 ఓవర్లలో 10 వికెట్లు కోల్పోయి 155 పరుగులు చేసింది. రాయచోటి పోలీస్ లెవెన్ జట్టు విజయం సాధించింది. మదనపల్లె పోలీస్ జట్టులో జిల్లా స్పెషల్ బ్రాంచ్ సీఐ రాజారమేష్ 51 పరుగులు చేశారు. అనంతరం స్థానిక వీసీసీ అధ్యక్షుడు, జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శ్రీధర్‌కుమార్, జిల్లా క్రికెట్ కోచ్ సునీల్ కుమార్‌లు ఎస్పీని సన్మానించి జ్ఞాపిక అందజేశారు. క్రికెట్ పోటీలు ముగిసిన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ యువత క్రీడలలో రాణించడం ద్వారా ఉజ్వల భవిష్యత్తు చేకూరుతుందన్నారు. వాల్మీకిపురం వాతావరణం, క్రీడాకారుల అభిమానం సంతోషాన్నిచ్చాయన్నారు. కార్యక్రమాలలో మదనపల్లె డీఎస్పీ మహేంద్ర, అన్నమయ్య జిల్లా స్పెషల్ బ్రాంచ్ సీఐ రాజారమేశ్, స్థానిక సీఐ రాఘవరెడ్డి, ఎస్ఐ చంద్రశేఖర్, స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది మోహన్‌బాబు, కేశవ, పోలీస్ సిబ్బంది, సీనియర్ క్రికెట్ క్రీడాకారులు పాల్గొన్నారు.

రాయచోటి పోలీస్ లెవెన్, మదనపల్లె పోలీస్ లెవెన్ జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్



హార్సిలీహిల్స్‌లో సండే సందడి

● పర్యాటకులతో కళకళ లాడిన కొండ

బి.కొత్తకోట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా ఊటీగా పేరుగాంచిన పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ ఆదివారం పర్యాటకులతో కళకళలాడింది. బెంగళూరు వైపు నుంచి వచ్చే సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల బృందాలు, జంటలు, యువకులు పెద్ద ఎత్తున హిల్స్‌కు చేరుకొని బస చేశారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పర్యాటకులు తరలి వచ్చారు. ఆకాశం మేఘావృతమై వాతావరణం చల్లగా ఉండటంతో హిల్స్‌కు వచ్చిన పర్యాటకులకు తియ్యని అనుభూతి మిగిలింది. గాలిబండ, పాత, కొత్త వ్యూ పాయింట్లు నుంచి ప్రకృతి అందాలు తిలకిస్తూ, ఫారెస్ట్ క్యాంపస్‌లో ఫొటో షూట్, మానస సరోవరంలో బోటింగ్ చేస్తూ ఉల్లాసంగా గడిపారు.



హార్సిలీహిల్స్‌లోని మానస సరోవరంలో బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

కడపలో క్రికెట్ ఫీవర్



కడప స్పోర్ట్స్ నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మహిళా వరల్డ్ కప్ ఫైనల్‌కు ఇండియా మహిళా జట్టు చేరుకోవడంతో కడపలో అభిమానుల ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. ఆ క్రమంలో ఆదివారం సౌతాఫ్రికా జట్టుతో ఇండియా మహిళా జట్టు తలపడింది. ఈ నేపథ్యంలో అభిమానులు ప్రత్యక్ష ప్రసారం వీక్షించేందుకు అనువుగా కడప నగరం రాజీవ్‌పార్కు వద్ద బిగ్ స్క్రీన్ ఏర్పాటు చేశారు. తొలుత బ్యాటింగ్ చేసిన ఇండియా మహిళా జట్టు 50 ఓవర్లలో 298 పరుగులు చేసింది. జట్టు క్రీడాకారిణిలు సిక్స్‌లు, ఫోర్‌లు కొట్టినప్పుడల్లా అభిమానులు రెట్టింపు ఉత్సాహంతో కేరింతలు కొట్టారు.

కారుణ్య మరణానికి అనుమతించండి

● వడ్డీ వ్యాపారుల ఒత్తిళ్లు తాళలేక..

● కలెక్టర్, ఎస్పీలకు ఓ వ్యాపారి విజ్ఞప్తి

7

శవాన్ని దొంగిలించడానికి యత్నం

● వ్యక్తిని పట్టుకొని పోలీసులకు అప్పగించిన స్థానికులు

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య


ఉపేంద్ర (ఫైల్)

మదనపల్లె అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం పోతబోలు గ్రామం సిద్ధంగారి పల్లెకు చెందిన వెంకటరమణ కుమారుడు ఉపేంద్ర (35) ఆదివారం ఉదయం ఇంట్లో చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తాలుకా పోలీసుల కథనం మేరకు... ఉపేంద్ర బెంగళూరు, హైదరాబాదు, మదనపల్లెలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేసేవాడు. మూడేళ్ల క్రితం మదనపల్లె మండలం సీటీఎం గ్రామం మిట్టపల్లెకు చెందిన కృష్ణవేణిని వివాహం చేసుకున్నాడు. వీరికి 10 నెలల కుమారుడు ఉన్నాడు. ఇటీవల ఉపేంద్ర పనిమానేసి మద్యానికి బానిసయ్యాడు. శనివారం భార్య కృష్ణవేణిని అమ్మగారి ఊరు వెళ్లింది. ఆదివారం ఉదయం సిద్దంగారిపల్లెకు వచ్చి చూడగా భర్త ఉపేంద్ర ఉరి వేసుకోవడం చూసి కేకలు వేసింది. దీంతో గ్రామస్థులు తాలుకా పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం మదన పల్లె జిల్లా ప్రభుత్వాసుత్రికి తరలించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలుకా సీఐ కళా వెంకటరమణ పేర్కొన్నారు.

అప్పుల బాధతో టైలర్...

మదనపల్లె అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో టైలర్ వెంకటరమణ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మదనపల్లె పట్టణంలో చోటు చేసుకుంది. టూటౌన్ పోలీసుల వివరాల మేరకు మదనపల్లె పట్టణం ప్రశాంతనగర్‌కు చెందిన కొండప్ప కుమారుడు వెంకటరమణ మదనపల్లె పట్టణంలో టైలర్ షాపు నిర్వహిస్తూ చిట్స్ వేసేవాడు. ఇతనికి ఇద్దరు కుమారైలు. భార్య రమణమ్మతో కలిసి ప్రశాంతనగర్‌లో ఉంటున్నాడు. ఆమె ఇళ్ల నిర్మాణ పనులకు ప్రతి రోజు వెళుతోంది. ప్రతి రోజూ లాగే శనివారం పనులకు వెళ్లింది. ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో వెంకటరమణ ఉరేసుకున్నాడు. సాయంత్రం ఇంటి వచ్చిన భార్య చూసి టూటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహన్ని మదనపల్లె జిల్లా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. ఆదివారం పోర్టుమాస్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఈ మేరకు టూటౌన్ సీఐ రాజారెడ్డి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

భూ వివాదంలో మహిళకు గాయాలు

నిమ్మనపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): భూమి వివాదంలో జరిగిన ఘర్షణలో ఓ మహిళకు రక్త గాయాలు కావడంతో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. తవళం పంచాయతీ నల్లంవారిపల్లిలో సర్వే నెంబరు 549-బి-6లో 3ఎకరాల 58సెంట్ల భూమిలో అదే గ్రామానికి చెందిన పి.రెడ్డెప్ప అతని కుటుంబ సభ్యులు వ్యవసాయం చేసుకుంటున్నారు. కాగా ఇదే గ్రామానికి చెందిన పుంగనూరు భువనేశ్వరి ఆమె కుంటుబ సభ్యులు ఆ భూమి తన మామ రాజన్నకు చెందినదని, తమకు తెలియకుండా రెడ్డెప్ప తన పేరున మార్చుకొని అనుభవిస్తుండంతో కోర్టుకు వెళ్లి ఇంజక్షన్ అర్డరు తెచ్చుకొన్నట్లు తెలిపారు. కాగా భువనేశ్వరి పొలం వద్ద కు వెళ్లి చదును చేయిస్తుండగా రెడ్డెప్ప అతని కుమారుడు సతీష్, భార్య శాంతమ్మ, చెల్లెలు రెడ్డెమ్మ తనపై కొడవలితో దాడి చేసి గాయపరచినట్లు ఫిర్యాదులో పేర్కొంది. దీంతో నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉప్పలూరులో దారి విషయంపై ఘర్షణ

- ఇరు వర్గాలకు చెందిన 12 మందిపై కేసు నమోదు

కాశినాయన, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) మండలంలోని ఉప్పలూరు గ్రామానికి చెందిన 12 మందిపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ యోగేంద్ర తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు ఉప్పలూరు ఎస్సీ కాలనీకి చెందిన ముడమాలు శిఖామణి, మాదారి రాజారత్నం కుటుంబాలు దారి విషయంపై గత కొన్ని రోజులుగా ఘర్షణ పడుతున్నారు. ఇందులో భాగంగా శనివారం ఇక్కడ నడిచేదానికి లేదంటూ దారికి అడ్డుగా శిఖామణి గోడ పెట్టాడు. గత కొన్ని సంవత్సరాలుగా ఇక్కడ నడుస్తున్నాము దారికి అడ్డుగా గోడ పెట్టవద్దంటూ రాజారత్నం మరి కొంతమంది అడ్డుచెప్పారు. ఈవిషయంపై కాలనీలోని పలు కుటుంబాలవారు రెండుగా విడిపోయి ఘర్షణ పడ్డారు. అనంతరం నర్సాపురం పోలీస్‌స్టేషన్‌లో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. పరస్పర ఫిర్యాదుల మేరకు 6 మంది చొప్పున మొత్తం 12 మందిపై కేసు నమోదు చేశామన్నారు.

శవాన్ని దొంగిలించడానికి యత్నం

- వ్యక్తిని పట్టుకొని పోలీసులకు అప్పగించిన స్థానికులు


గోతిలో పూడ్చిన శవాన్ని బయటకు తీసిన దృశ్యం

మదనపల్లె అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అంత్యక్రియలు నిర్వహించి పూడ్చిపెట్టిన ఓ శవాన్ని దొంగిలించడానికి ప్రయత్నం చేసిన ఘటన మదనపల్లె శివార ప్రాంతంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు... అంకిశెట్టిపల్లెకు వెళ్లే మార్గంలో శ్మశానం ఉంది. ఇందులో శనివారం ఓ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించి వెళ్లారు. ఆదివారం సాయంత్రం రాజస్థాన్ రాష్ట్రం జయపూర్‌కు చెందిన గోవిందు అనే వ్యక్తి మట్టిని తవ్వి గోతిలో నుంచి మృతదేహాన్ని బయటకు తీస్తుండగా అటుగా వెళ్లే స్థానికులు గుర్తించారు. వెంటనే ఆ వ్యక్తిని పట్టుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. తాలుకా పోలీసులు అక్కడికి చేరుకుని నిందితున్ని విచారించారు. డెడ్‌బాడీ అవయవాల కోసం ఈ దారుణం చేస్తున్నట్లు ఒప్పుకున్నాడు. వెంటనే నిందితున్ని తాలుకా పోలీసుస్టేసన్‌కు తరలించారు. ఈ మేరకు తాలుకా సీఐ కళా వెంకటరమణ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


పూడ్చిన శవాన్ని దొంగలించడానికి ప్రయత్నించిన వ్యక్తిని విచారిస్తున్న పోలీసులు

కారుణ్య మరణానికి అనుమతించండి...!

- వడ్డీ వ్యాపారుల ఒత్తిళ్లు తాళలేక..
- కలెక్టర్, ఎస్పీలకు ఓ వ్యాపారి విజ్ఞప్తి
- తన ఆవేదన వ్యక్తం చేస్తూ బోర్డు ఏర్పాటు

రైల్వేకోడూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కారుణ్య మరణానికి అనుమతించాలంటూ రైల్వేకోడూరుకు చెందిన పాత సామాన్ల (గుజరి) వ్యాపారి తాటిగొట్ల మోహన్‌రాజు జిల్లా కలెక్టర్, ఎస్పీలకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఆదివారం తన దుకాణం వద్ద తానుపడుతున్న బాధను వ్యక్త పరుస్తూ బోర్డు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రైల్వేకోడూరులో గత 20 ఏళ్లుగా పాత ఇనుప సామాన్ల వ్యాపారం చేసుకుంటూ జీవ నం సాగిస్తున్నానని తెలిపారు. గతంలో వ్యాపారం బాగానే సాగిందని, ఆ సమయంలో పది లారీలు తీసుకుని పూర్తిగా నష్టపోయి అప్పులయ్యాయని అన్నారు. రైల్వేకోడూరు పట్టణంలో వ్యాపారపరంగా మంచి పేరు సంపాదించుకున్నానని, అప్పులు చేసిన వడ్డీ వ్యాపారులకు ప్రతి నెలా వడ్డీలు సక్రమంగానే చెల్లించానని తెలిపారు. నాలుగు సంవత్సరాల క్రితం కరోనా సమయంలో వ్యాపా రం సాగలేదన్నారు. దీంతో వడ్డీ వ్యాపారుల వద్ద తీసుకున్న అప్పుకు వడ్డీలు కట్టలేక, అసలు తీర్చలేక 2021లో ఐపీ పెట్టానని తెలిపారు. తిరిగి కొద్ది కొద్దిగా వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నానని, వడ్డీ వ్యాపారులకు అప్పులు చెల్లిస్తున్నానని తెలిపారు. అయితే బాకీలు తీరుస్తున్నా వడ్డీ వ్యాపారుల వేధింపులు ఎక్కువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తనకు అనుమతి ఇస్తే కిడ్నీలు, కళ్లు, నా అవయవాలు అమ్మి వడ్డీ వ్యాపారుల బాకీలు చెల్లించే విధంగా నిర్ణయం తీసుకున్నానని తెలిపారు. నేను వడ్డీ వ్యాపారుల దగ్గర తీసుకున్న డబ్బులతో బయట ఆస్తులు తీసుకున్నానని ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు విచారణ నిర్వహించి నాకు ఎటువంటి ఆస్తులు, స్థిరాస్తులు ఉన్నా వడ్డీ వ్యాపారులకు ఇవ్వాలన్నారు. ఇది నా మరణ వాంగ్మూలంగా భావించి, తనకు న్యాయం చేయాలని కోరారు.


రైల్వేకోడూరులో బోర్డు ఏర్పాటు చేసిన మోహన్‌రాజు

బోరుబావుల్లో ఉబికి వస్తోన్న భూగర్భజలం


మహానందిపల్లె సమీపంలో బోరుబావి నుంచి బయటకు వస్తున్న నీరు

కలసపాడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలతో మోటార్ స్విచ్ ఆన్ చేయకపోయినా బోరుబావుల నుంచి భూగర్భజలం ఉబికి బయటకు వస్తోంది. మండల పరిధిలోని పెండ్లిమర్రి, చెన్నారెడ్డిపల్లె, సిద్ధమూర్తిపల్లె, మహానందిపల్లె, మావిళ్లపల్లె తదితర గ్రామాల్లో బోరు బావులతో పాటు పురాతన వ్యవసా య బావులలోంచి కూడా నీరు పొంగి పొలాల్లో ప్రవహిస్తున్నాయి. గత కొన్నేళ్ల నుంచి ఇలాంటి పరిస్థితి లేదని ఒక్కసారిగా భూగర్భ జలం పెరగడం సంతోషంగా ఉన్నా, మరో పక్క భూములు ఇప్పుడే ఆరక పంట సాగుకు ఆలస్యమయ్యే ఆందోళన ఉందని రైతులు అంటున్నారు.

5న కొండయ్యస్వామి జన్మదిన వేడుకలు



మైదుకూరు రూరల్, నవంబరు 2 (ఆంధ్ర జ్యోతి): అవధూత కొండయ్య స్వామి జన్మదిన వేడుకలు ఈనెల 5వ తేదీ ఘనంగా నిర్వ హిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని ధరణి తిమ్మాయపల్లె ఊసయ్య ఆశ్రమానికి చెందిన కొండయ్యస్వామి 44వ జన్మదిన వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 5వ తేదీ ఉదయం భారీ కేకు కటింగ్ ఉంటుందని, రాత్రి జబర్దస్త్ ఆర్టిస్టులచే కార్యక్రమం, సత్య హరిచంద్ర నాటకం, 6వ తేదీ రాష్ట్రస్థాయిలో వృష భరాజములచే ప్రత్యేక బండలాగుడు పోటీలు ఉంటాయన్నారు. గెలుపొందిన ఎడ్లకు మొదటి బహుమతి రూ.3లక్షలు, రెండవ బహుమతి రూ.2లక్షలు, అలాగే పెద్ద బండలాగు పోటీలలో మొదటి బహుమతి రూ.1,58,118, రెండో బహుమతి రూ.1,08,118, మూడో బహుమతి రూ.75,118, నాల్గవ బహుమతి రూ.50,118, ఐదో బహుమతి రూ.25,118 ఉంటుందని వారు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ప్రాథమిక ఆరోగ్యం, ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ


అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్ఎస్ పీఓ శచీదేవి, విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నాగరాజు పేటలో కోటిరెడ్డి మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్యం, ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ పి.శచీదేవి మార్గదర్శకత్వంలో వలంటీర్లు వీధుల్లో ఫ్లకార్డులు ప్రదర్శించారు. వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యకరమైన ఆహారం, వారానికి కనీసం ఐదు రోజులు అరగంట పాటు నడక, ప్రతిరోజు పది నిమిషాల ధ్యానం వంటి అలవాట్ల ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. సీజనల్ వ్యాధులు, ఎయిడ్స్, పొగతాగడం, మద్యపానం, మత్తుపదార్థాలతో అనర్థాలపై వలంటీర్లు ప్రజల్లో అవగాహన కల్పించారు. ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ పి.శచీదేవి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.సలీంబాషా అభినందించారు.

కార్మికుల హక్కులు కాలరాస్తే ఉద్యమిస్తాం



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు

కడప నాగరాజుపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులు కాలరాస్తే ఉద్యమిస్తామని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏపీ నాగేశ్వరరావు హెచ్చరించారు. ఆదివారం యూటీఎఫ్ కార్యాలయం వద్ద సీఐటీయూ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కార్మిక హక్కులు కాలరాస్తే ఉద్యమిస్తామన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వం తానా అంటే రాష్ట్ర ప్రభుత్వం తందాన అంటోందన్నారు. కార్మిక చట్టాలు మార్చడం, 13 గంటలు పని చేయాలని ఆదేశాలు ఇవ్వడం సరైంది కాదన్నారు. అసంఘటిత రంగ కార్మికుల పరిస్థితి మరీ ఘోరమని తెలిపారు. డిసెంబరు 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు విశాఖ పట్టణంలో నిర్వహించనున్న సీఐటీయూ ఆలిండియా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి, సీఐటీయు జిల్లా కార్యదర్శులు కె.సత్యానారాయణ, వెంకటసుబ్బయ్య, ఉపాధ్యక్షులు భైరవ ప్రసాద్, జి.చంద్ర శేఖర్, ఆర్.లక్ష్మిదేవి, జిల్లా కమిటీ సభ్యులు విజయ్ కుమార్, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

కడప క్రైం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఫాతిమా మెడికల్ కళాశాల సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. దినట్లు కడప ట్రాఫిక్ పోలీసుల వివరాల మేరకు... ఆదివారం చెన్నూరుకు చెందిన ఎమ్.సూర్యచంద్ర (35) ద్విచక్రవాహనంలో పులివెందల రోడ్డు వైపు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో ఫాతిమా కళాశాల సమీపంలోకి రాగానే వేగం అదుపు కాక డివైడర్‌ను ఢీకొన్నాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

డ్రాగా ముగిసిన క్రికెట్ మ్యాచ్‌లు


అష్కాన్ (కడప), తాహిర్ (కడప), మోక్షజ్ఞ (అనంతపురం)

కడప కల్చరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కడపలో వివిధ జట్ల మధ్య జరుగుతున్న ఏసీఏ అండర్ 14 మెన్స్ సబ్‌జోన్ ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లు ఆదివారం డ్రాగా ముగిశాయి. వివరా లిలా..

నగర రిమ్స్ సమీప వైఎస్ రాజా రెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో కర్నూలు-కడప జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలు త బ్యాటింగ్ చేసిన కర్నూలు జట్టు 69.5 ఓవర్లలో 125 పరుగులకు ఆలౌట్ అయిన సంగతి తెలిసిందే. ఇందుకు ప్రతిగా బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 24 ఓవర్లలో మొదటిరోజు ఆట ముగిసే సమయానికి రెండు వికెట్లు కోల్పోయి 68 పరుగులు చేసింది. ఇందులో అషాన్ 31 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో ఉన్నారు. ఓవర్ నైట్ స్కోరు 68 పరుగులతో రెండోరోజైన ఆది వారం బ్యాటింగ్ చేపట్టి 89.3 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 249 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఇందులో తాహిర్ 63 పరుగులు చేశారు. దీంతో కడప జట్టుకు 124 పరుగుల ఆధిక్యత లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ దిగిన కర్నూలు జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 31 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 58 పరు గులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసినట్లు నిర్వాహకులు వెల్లడించారు.

కేవోఆర్‌ఎం క్రికెట్ మైదానంలో అనంతపురం-నెల్లూరు జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన నెల్లూరు జట్టు 58.5 ఓవర్లలో 186 పరుగులకు ఆలౌట్ అయిన సంగతి తెలిసిందే. ఇందుకు ప్రతిగా బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో మొదటిరోజు ఆట ముగిసే సమయానికి 37 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 86 పరుగులు చేసింది. కాగా ఓవర్‌నైట్ స్కోరు 86 పరుగులు తిరిగి రెండ రోజు ఆదివారం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు మొత్తంగా 83.4 ఓవర్లలో 242 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో అనంతపురం జట్టుకు 56 పరుగుల ఆధిక్యత లభించింది. ఇందులో మోక్షజ్ఞ తేజ 84 పరుగులు చేయడం విశేషం. అనంతరం రెండో ఇన్నింగ్స్ దిగిన నెల్లూరు జట్టు ఆట ముగిసే సమయానికి 45 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 159 పరుగులు చేసింది. ఇందులో షామీర్ 59 పరుగులు చేశాడు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసినట్లు నిర్వాహకులు వెల్లడించారు.

టెట్ మినహాయింపు ఇవ్వాలి.. ఆపస్


మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు వివరిస్తున్న ఆపస్ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలని ఆపస్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్‌లో పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుని ఆపస్ జిల్లా బృందం కలిసింది. సర్వీస్ రూల్స్ సాధనలో ఆయన చేసిన సహకారానికి కృతజ్ఞతలు తెలుపుతూ, పూర్తిస్థాయిలో సర్వీస్ రూల్స్ అమలు కావడానికి కృషిచేయాలని కోరింది. అలాగే 2010కి ముందు నియమితులైన ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులను టెట్ ఉత్తీర్ణత నుంచి మినహాయించేలా కేంద్రం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. సుప్రీంకోర్టు తాజా తీర్పుకారణంగా ఉపాధ్యాయుల్లో ఆందోళన నెలకొందని ఆపస్ నేతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్రకార్యదర్శులు వెంకటరామిరెడ్డి, సుబ్బరాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు, చంద్రమోహన్, బాలకృష్ణుడు, రఘుప్రసాద్, రెడ్డయ్యరెడ్డి, నాగమునీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రుడికి వెండి బిస్కెట్ వితరణ


వితరణ చేస్తున్న కర్ణాటక భక్తుడు


రాయచోటిటౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలో వెలిసిన భద్రకాళీ సమేత వీరభద్రస్వామికి ఆదివారం కర్ణాటక రాష్ట్రం బెంగళూరు నివాసి వై.వీరప్ప ఒక కేజీ వెండి బిస్కెట్ బహుకరించారు. దాతలకు ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు అర్చనలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

నాగనాథేశ్వరుని కొండపైకి వాహనాలు బంద్

- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీ
- భక్తులు సహకరించాలి : సీఐ


పార్కింగ్ స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ వంశీధర్, చైర్మన్ సుమన్‌రెడ్డి

ఖాజీపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం రెండవ సోమవారం పురష్కరించుకుని తెల్లవారుజామునుంచే నాగనాథేశ్వరుని దర్శించుకునేందుకు భారీగా భక్తులు కొండ పైభాగానికి చేరుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేస్తారు. అయితే కొండ పైభాగంలో ఎక్కువ పార్కు చేసే స్థలం లేనందున వాహనాలను కింది భాగంలో నిలిపివేస్తు న్నట్లు సీఐ వంశీధర్ తెలిపారు. ఆదివారం కొండ కింది భాగంలో పార్కింగ్ స్థలాన్ని పరిశీలించి అనంతరం సీఐ మాట్లాడుతూ కార్తీక మాసంలో సోమవారం మాత్రమే వాహనాలు పైకి అనుమతించబడవని, భక్తులు సహకరించాలని కోరారు. కాగా, కొండ కింది భాగం నుంచి పైకి వెళ్లడానికి ఆటోలు ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ సుమన్‌రెడ్డి అన్నారు. లేదంటే కాలి మార్గాన కొండ పైకి వెళ్లవచ్చన్నారు. భక్తుల కోసం కొండ కింది భాగంలో భారీగా అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.



LOSS OF PASSPORT

I, CHEERALA GAGANA (AADHAR NO.4236 8111 5423), D/O CHEERALA YOGEESWARA, resident of Dno:1, Sunnapurallapalli Village, Y Kota, Obulavaripalli Mandal, Annamayya Dt, A.P. have lost my Indian Passport No.T1940201 issued by the Kuwait Passport. If anyone found please contact above address
AJC-258609

కావలెను

ప్రొద్దుటూరు ప్లైవుడ్ షాపు నందు పవర్ టూల్స్, సేల్స్ & మెకానిక్ షాప్ సేల్స్‌మెన్,కంప్యూటర్ ఆపరేటర్, ఆఫీసు బాయ్, అవుట్‌డోర్ సేల్స్‌మెన్ కావలెను. సెల్ : 91004 63787
Ajc-249697

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డ్ పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర: 7382114647.
AJA- 246990

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతిలో ప్రకటనల కోసం సంప్రదించండి

యూనిట్ కార్యాలయం
9985411183
9985411189

హైవేకి దిక్కెవ్వరు..?

● శిథిలావస్థలో బ్రిడ్జి ● పొంచి ఉన్న ప్రమాదం ● పట్టించుకోని అధికారులు

ఈ చిత్రంలో కనిపిస్తున్నది ఎక్కడో మారుమూల ప్రాంతంలో ఉన్న సాదాసీదా బ్రిడ్జి కాదు.. హైదరాబాద్-చెన్నై జాతీయ రహదారి. అయితే ఏం లాభం.. పేరుగొప్ప, ఊరు దిబ్బ అన్నట్టు ఆ బ్రిడ్జి దెబ్బతిని కడ్డీలు బయటపడుతున్నా పట్టించుకునే నాథుడు లేడు.. నిత్యం అధికారులు, ప్రజాప్రతినిధులు ఆ దారిన వెళుతున్నా ప్రయోజనం శూన్యమని. హైవే పరిస్థితే ఇలా ఉంటే ఇక గ్రామీణ రోడ్ల పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని పలువురు పేర్కొంటున్నారు.



ఒంటిమిట్ట వద్ద దెబ్బతిన్న బ్రిడ్జిపై వెళుతున్న భారీ వాహనాలు



బ్రిడ్జి పెచ్చులూడి ఇనుప కమ్మీలు బయటపడిన దృశ్యం

ఒంటిమిట్ట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కడప - చెన్నై ప్రధాన రహదారిలోని ఒంటిమిట్ట కోదండ రామస్వామి కల్యాణ వేదిక సమీపంలో ఉన్న బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుంది. కడప-చెన్నై ప్రధాన రహదారి కావడంతో ప్రతిరోజు వందలాది వాహనాలు ఈ బ్రి డ్జిపై వెళ తుంటాయి. మహారాష్ట్ర, కర్ణాటక, తెలం గాణ, గుజరాత్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల వెంకన్న భక్తులు ఈ మార్గం ద్వారానే తిరుమల వెంకటేశ్వర స్వామి ఆల యానికి వెళ్లాల్సి ఉంది. అలా గే చెన్నై, తిరుత్తణి, అరక్కోణం తదితర ప్రాంతాలకు కూడా ఈ బ్రిడ్జిపై నుంచి వాహనాలు వెళ్లాల్సి ఉంది. ప్రతిరోజు వందలాది భారీ వాహనాలు తిరుగుతుం డటంతో బ్రిడ్జి రోజు రోజుకూ శిథిలావస్థకు చేరుకుంది. ఒంటిమిట్ట కోదం డరామ స్వామి కల్యాణ వేదికకు అతి సమీపంలో ఉన్న ఈ బ్రిడ్జి పెచ్చులూడి కడ్డీలు బయట పడుతున్నాయి. ప్రతి యేడాది ఒంటిమిట్ట కోదండరామస్వామి కల్యాణోత్సవాన్ని భారీఎత్తున నిర్వహిస్తున్నారు. ఈ కల్యాణ వేదికకు వెళ్లాలం టే బ్రిడ్జి పైనుంచి వెళ్లాల్సి ఉంది. కల్యాణోత్సవానికి విచ్చేసే రాష్ట్ర ముఖ్యమంత్రి, గవర్నర్, రాష్ట్ర మంత్రులు, ప్రముఖ వీఐపీలు కోదండరాముని దర్శనం అనంతరం ఈ బ్రిడ్జి ద్వారా కల్యాణోత్సవ వేడుకకు చేరుకోవాల్సి ఉంది. ఈ బ్రిడ్జి నిర్మాణం జరిగి సుమారు 30 సంవత్సరాలు పూర్తి అవుతోంది.

బ్రిడ్జి కిందిభాగంలో పెచ్చు లూడి ఇనుకప కమ్మీలు బయట పడుతుండడంతో రోడ్డుపై ప్రయాణిస్తున్న భారీ వాహన యజమానులు ఆందోళన చెందుతు న్నారు. ఈ విషయమై ఆర్అండ్‌బి ఏఈని వివరణ కోరగా ఈ బ్రిడ్జి తమ పరిధిలోకి వస్తుందో లేక నేషనల్ పరిధిలోకి వస్తుందో తనకు తెలియదన్నారు. మండల ఆర్ అండ్ బి ఏఈగా పనిచేస్తున్న వ్యక్తికి ఈ బ్రిడ్జి ఎవరి పరిధిలోకి వస్తుందో తెలి యదనడం విడ్డూరంగా ఉంది. ప్రధాన రహదారిలో ఉన్న ఈ బ్రిడ్జి ఏ శాఖ పరిధిలోకి వస్తుందో మండల అధికారిగా పనిచేస్తున్న ఇతనికి తెలి యకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోందని పలువురు పేర్కొంటున్నారు.

మెరుగైన సమాజం కోసం కృషి అభినందనీయం

● డీఈవో డాక్టర్ సుబ్రమణ్యం



మట్లాడుతున్న డీఈవో డాక్టర్ సుబ్రమణ్యం

రాయచోటిటౌన్, నవంబరు2(ఆంధ్రజ్యోతి): విద్య, వైద్యం, జీవనోపాధితో పాటు పర్యావరణ పరిరక్షణ చర్యలు చేపడుతూ మెరుగైన సమాజం కోసం మనం సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ కే. సుబ్రమణ్యం అన్నారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని డైట్ కేంద్రంలో జరిగిన మనం సంస్థ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ సభ్యులు తమ పాఠశాల నుంచి నేర్చుకున్న విలువలను సామాజిక సేవా రూపంలో తిరిగి సమాజానికి అందించాలనే నిబద్ధతతో పనిచేయడం గొప్ప విషయమన్నారు. సామాజిక సేవకు అంకితమైన పూర్వ విద్యార్థుల వినూత్న ఆరంభం పలువురికి ఆదర్శప్రాయం అన్నారు. మనం సంస్థ వ్యవస్థాపకుడు యోగానంజులరెడ్డి, డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మడితాటి నరసింహారెడ్డి, మనం ప్రెసిడెంట్ దేవేంద్రారెడ్డి, సభ్యులు వెంకట్రామిరెడ్డి, జోషి, శ్రీనివాసులు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న యువకులు

సుండుపల్లె, నవంబరు2(ఆంధ్రజ్యోతి):రక్తదానం ప్రాణదానంతో సమానమని సంఘ సేవకుడు డాక్టర్ సయ్యద్ అహ్మద్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 మంది యువకులు రక్తదానం చేశారన్నారు. జనసేన మహిళ నాయకురాలు రెడ్డిరాణి, ప్రధానోపాధ్యాయులు రవీంద్రనాథ్‌రెడ్డి, కొరియోగ్రాఫర్ రేష్మ పాల్గొన్నారు.

అన్నదానం పుణ్యకార్యం

సుండుపల్లె, నవంబరు2(ఆంధ్రజ్యోతి): అన్నదానం పుణ్యకార్యమని అయ్యప్ప మాలధారణ స్వాములు తెలిపారు. ఆదివారం మండలంలోని వీరూపాక్ష చెన్నకేశవస్వామి ఆలయంలో 400 మంది అయ్యప్ప మాలధారణ స్వాములకు ఆర్ఎంపీ డాక్టర్ హరిశంకర్‌రెడ్డి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ అయ్యప్ప మాలలు ధరించి కఠోర దీక్ష చేస్తున్న భక్తులకు అన్నదానం (భిక్ష) ఏర్పాటు చేయడం పుణ్య కార్యమన్నారు. అయ్యప్ప, విరూపాక్షి చెన్నకేశవస్వామి, శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కంటి రోగులకు ఆపరేషన్లు

రాయచోటిటౌన్, నవంబరు2(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణ పరిధిలోని చెన్నముక్కపల్లి గ్రామంలో గల లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం జరిగిన కంటి వైద్య శిబిరంలో 8 మంది కంటి రోగులకు ఆపరేషన్లు నిర్వహించారు.లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మెన్ వైవీఆర్ స్వరూపగుప్త, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ చెన్నూరు అన్వర్‌బాషా, కంటి వైద్యులు సురేశ్‌బాబు, భార్గవి, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్‌రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఒకేషనల్ కోర్స్‌తో ఉపాధి అవకాశాలు

రామాపురం, నవంబరు2(ఆంధ్రజ్యోతి): ఒకేషనల్ కోర్స్‌తో ఉపాధి అవకాశాలను మెండుగా ఉన్నాయని కేజీబీవీ ప్రిన్సిపాల్ పుష్పలత అన్నారు. కేజీబీవీలో చదువుతున్న 9, 10, 11, 12 విద్యార్థినులకు ఆదివారం ప్రిన్సిపాల్ అధ్యక్షతన ఇండస్ట్రియల్ సందర్శన, ఫుడ్ ప్రాసెసింగ్ ట్రాక్‌పై కార్యక్రమం నిర్వహించారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాల డైరీలను బాలికలతో కలిసి సందర్శించారు.

సూపరింటెండెంట్‌ను అభినందించిన ఉపాధ్యాయులు



డాక్టర్ లక్ష్మీప్రసాద్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

రాయచోటి(కలెక్టరేట్), నవంబరు2(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా రాయచోటి ఏరియా హాస్పిటల్‌లో సివిల్ సర్జన్‌గా పనిచేస్తున్న డాక్టర్ దేరంగుల లక్ష్మీప్రసాద్ సూపరెంటెండ్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఉపాధ్యాయులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయులు కోటకొండ రమణ, పల్లపు వెంకట్రమణ, హాస్పిటల్స్ సూపరింటెండెంట్ లక్ష్మీప్రసాద్‌ను సన్మానించారు. ఉపాధ్యాయులు రేపన ఆంజనేయులు, డైట్ లెక్చరర్ తిరుపతి శ్రీనివాసులు, దేరంగుల శంకరప్రసాద్, పల్లపు చిన్నపరాజు, గొడ్డిండ్ల తిరుపతి, చల్లా రమణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్‌లో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు



సూపర్ జీఎస్టీ గురించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్ఎస్ అధికారులు

రాయచోటి టౌన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి):రాయచోటి పట్టణంలోని రాయుడు కాలనిలో ఆదివారం ఉర్దూ పాఠశాల ఆవరణంలో జూనియర్ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్ఎస్ఎస్ ఆఫీసర్ పి.జ్యోతి, ప్రిన్సిపాల్ జి. వెంకరటరమణ మాటాల్డతుతూ జీఎస్టీ గురించి ప్రజలందరూ తెలుసుకోవాలన్నారు. విద్యార్థులు మొక్కలను నాటి పచ్చదనం పెంచాలన్నారు. ప్లాస్టిక్ వాడకాని తగ్గించి కాలుష్య రహిత రాయచోటిని రూపుదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన యువకులు

రాయచోటి(నేతాజీ సర్కిల్), నవంబరు2(ఆంధ్రజ్యోతి): సంబేపల్లె మండలానికి చెందిన టీడీపీ జిల్లా కార్యదర్శి సుబ్బరాజు యాదవ్ తనయుడు వీరప్రసాద్‌నాయుడు, దేవపట్ల సింగిల్‌విండో డైరెక్టర్, టీడీపీ నాయకుడు రాళ్లపల్లి వేణుగోపాల్ తనయుడు రాహుల్‌నాయుడులు ఆదివారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిని కలిశారు. లండన్ పర్యటనలో భాగంగా చంద్రబాబు దంపతులు విమానాశ్రయంలో ఉండగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

నిత్యపూజకోన భక్తులకు మెరుగైన వసతులు

సిద్దవటం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మహోత్సవాల సందర్భంగా భక్తులకు మెరుగైన వసతులు కల్పిస్తామని నిత్యపూజేశ్వర ఆలయ చైర్మన్ జంగిటి రాజేంద్రప్రసాద్ తెలిపారు. పంచలింగాల గుడి వద్ద తాగునీటి గుండాల్లో బ్లీచింగ్ పిచికారీ చేయిస్తామన్నారు. వర్షానికి దెబ్బతిన్న రహదారిని తాత్కాలికంగా మరమ్మతులు చేయించామన్నారు. ఆలయ సిబ్బంది చంద్ర తదితరులు పాల్గొన్నారు.

పూజలు అందుకున్న అమ్మవారు

సిద్దవటం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గ్రామ శివారులోని మూలపల్లె క్రాస్ సమీపాన వెలసిన ఇరుగులమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సి.రమణయ్య మాట్లాడుతూ అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకాలు, సిద్దవటం ఆకులవీధి గ్రామానికి చెందిని సిరిగిరి సుధాకర్ కుటుంబీకులు భక్తులకు అన్న ప్రసాదాలు ఏర్పాటు చేశారన్నారు.

క్రికెట్ జట్టు విజయం సాధించాలి

రైల్వేకోడూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ముంబైలో నిర్వహించే ప్రపంచ కప్ వన్డే మహిళా భారత క్రికెట్ పోటీల్లో భారత జట్టు విజయం సాధించాలని రైల్వేకోడూరులోని హోసన్నా ప్రార్థనా మందిరంలో ఆదివారం రాష్ట్ర గ్రీనరీ, బ్యూటిఫికేషన్ డైరెక్టర్ పుల్లెల రమేష్‌బాబు ప్రార్థనలు చేశారు. ఈ మేరకు హిందూ ఆలయాలు, మసీదుల్లో కూడా పూజలు చేసినట్లు తెలిపారు. ఓబలి చంద్రమౌళి, తిమోతి, నరిగి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో బంగారు పతకం



సారాను అభినందిస్తున్న కోచ్ మౌలా

రైల్వేకోడూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఏలూరులో ఈ నెల 1, 2 తేదీల్లో నిర్వహించిన అండర్-17 రాష్ట్ర స్థాయి పోటీల్లో రైల్వేకోడూరు షిర్డిసాయి జూనియర్ కళాశాల విద్యార్థిని ఎస్కే సారా బంగారు పతకాన్ని సాధించినట్లు తైక్వాండో కోచ్ ఎస్కే మౌలా తెలిపారు. అరుణాచల్‌ప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

దుమ్ముధూళిని భరించలేకున్నాం

● మాధవరంపోడు గ్రామస్థుల నిరసన ● నిలిచిపోయిన ట్రాఫిక్



మాధవరంపోడు గ్రామం ప్రధాన రహదారి వద్ద నిరసన తెలుపుతున్న ప్రజలు



నిలిచిపోయిన వాహనాలు

రైల్వేకోడూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రధాన రహదారిపై దుమ్ము రేగుతుండటంతో ఇబ్బందిపడుతున్నామని మాధవరంపోడు గ్రామస్థులు ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మీడియాతో మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తిరుపతి-రైల్వేకోడూరు ప్రధాన రహదారి దెబ్బతిందన్నారు. మాధరంపోడు వద్ద గుంతలు పడ్డాయని, వాటిపై మట్టి పోయడంతో దుమ్ము రేగుతోందన్నారు. దుమ్మూధూళితో దగ్గు, జలుబు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత గుంతలకు మరమ్మతులు చేశారని, ఇటీవల కురిసిన వర్షాలకు మళ్లీ పాడైపోయాయన్నారు. ప్రధానదారికి పక్కనే తమ గ్రామం ఉండడంతో విపరీతంగా దుమ్ము ఇళ్లలోకి వస్తోందన్నారు. ఆ దుమ్ము ఇళ్లు, దుకాణల్లోకి వస్తుం డటంతో వస్తువులు పాడవుతున్నాయన్నారు. ఈ మేరకు ఒక గంట పాటు గ్రామస్థులు నిరసన తెలపడంతో ఇటు తిరుపతి, అటు కడప వైపు ట్రాఫిక్ నిలిచిపోయింది. మాధవరంపోడు గ్రామస్థులు పోలీసులతో వాగ్వాదం చేశారు. రైల్వేకోడూరు సీఐ కే. హేమసుందరరావు, ఎస్ఐ వీఎల్ ప్రసాద్‌రెడ్డి మాధవరంపోడు గ్రామానికి హుటాహుటిన చేరుకుని గ్రామస్థులతో చర్చించారు. దీంతో గ్రామస్థులు శాంతించారు.

కొత్తగా రోడ్డు వేయండి : సీఐటీయూ

రైల్వేకోడూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): తిరుపతి-కడప ప్రధాన రహదారికి కొత్తగా రోడ్డు వేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. తిరుపతి మార్గంలో ఆదివారం దెబ్బతిన్న రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలకు రోడ్లు దారుణంగా దెబ్బతిన్నాయన్నారు. కడపకు రెండు గంటల్లో చేరుకోవాల్సి ఉండగా మూడు గంటలకు పైగా పడుతోందన్నారు. వెంటనే రోడ్లును బాగా చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే గ్రామస్థుల సహకారం తో ఆందోళనలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



దెబ్బతిన్న రోడ్డును చూపుతున్న చంద్రశేఖర్

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

రామాపురం, నవంబరు2(ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటిటౌన్ ఆధ్వర్యంలో ఎన్జీవో కాలనీవాసులు, లయన్స్ క్లబ్ రీజినల్ చైర్మన్ లయన్ షేక్ మహమ్మద్, షేక్ ఆయేషా కుమారుడు షేక్ అద్నాన్ పుట్టినరోజు సందర్భంగా రామాపురం మండలం బండపల్లి పంచాయతీ ప్రేమాలయం వృద్ధాశ్రమంలో ఆదివారం అన్నదానం చేసినట్లు అధ్యక్షుడు లయన్ పసుపులేటి శ్యామ్ తెలిపారు. అనంతరం దాతలు మాట్లాడుతూ తమ కుమారుడు అద్నాన్ పుట్టిన రోజు సందర్భంగా అన్నదానం చేశామన్నారు. వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ పీఎస్ హరినాథ్‌రెడ్డి, కార్యదర్శి లయన్ షేక్ ఇందాద్‌అహ్మద్, కోశాధికారి లయన్ మనోహర్‌రాజు, లయన్ నారాయణరెడ్డి, పకీర్‌సాబ్, ఫరూక్, ఆశ్రమం సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మించాలి

పెనగలూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పెనగలూరు ఎగువ హరిజనవాడ, ముస్లిం కాలనీల్లో డ్రైనేజీ కాలువ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. ఆయా కాలనీల్లో వర్షపు నీరు నేటికీ నిల్వ ఉందన్నారు. మరో నెల రోజుల పరిస్థితి ఇలాగే కొనసాగితే రోడ్డుపై పూర్తిగా పాచిపట్టి పాదచారులు నడవలేనంతగా తయారవుతుందన్నారు. అధికారులు వెంటనే స్పందించాలని విన్నవించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● గంగమ్మ తల్లికి జలహారతి ఇచ్చిన చమర్తి జగన్‌మోహన్‌రాజు



చెరువు అలుగు వద్ద పూజలు చేస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జ్ చమర్తి జగన్‌మోహన్‌రాజు

నందలూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని తెలుగుదేశం పార్టీ రాజంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. మండల కేంద్రంలోని కన్యకచెరువు అలుగు పారిన సందర్భంగా ఆదివారం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి గంగమ్మకు జలహారతి ఇచ్చారు. అనంతరం చెరువు గట్టున వెలసిన అనంతపుర అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ మంచి ప్రభుత్వానికి దైవం కూడా సహకరిస్తుందన్నారు. వర్షాలే పడవు అన్నారని, మంచి పాలనలో అలుగులు కూడా పారుతున్నాయన్నారు. ప్రతి గ్రామానికి సాగు, తాగునీరు పుష్కలంగా అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మాజీ ఆర్టీసీ చైర్మన్ యెద్దల సుబ్బరాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు జంగంశెట్టి సుబ్బయ్య, క్లస్టర్ ఇన్‌చార్జి పసుపులేటి ప్రవీణ్‌కుమార్, రాష్ట్ర టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ యెద్దల విజయసాగర్, నీటి సంఘం అధ్యక్షుడు బూశెట్టి వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యంతో బహుళ ప్రయోజనాలు

లక్కిరెడ్డిపల్లె,నవంబరు2(ఆంధ్రజ్యోతి): ప్రకృతి సేద్యంతో బహుళ ప్రయోజనాలు లభిస్తాయని ప్రాజెక్టు మేనేజర్ వెంకటమోహన్ పేర్కొన్నారు. ఆదివారం గార్లపల్లెలో జైశ్రీరామ్ డీఆర్సీ బయోరీసోర్స్ సెంటర్ ఏర్పాటు చేశారు. ప్రకృతి వ్యవసాయ వనరుల విత్తనాల కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. సందర్భంగా మాట్లాడుతూ రబీ ఖరీఫ్ సీజన్‌లకు ప్రధాన పంటలు ఆర్డీఎస్ విత్తనాల కి ట్లు అందుబాటులో ఉన్నాయని, రబీకి వేరుశనగ అందుబాటులో ఉన్నాయని ఆయన తెలియజేశారు.

రైతులు ఆర్డీఎస్ సీడ్ కిట్లను సజీలం చేసుకోవాలన్నారు. వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ వెంకట్రమణ, సరస్వతి, చంద్రమోహన్‌రెడ్డి, గంగిరెడ్డి, లక్ష్మీదేవి, నాగమణి, రైతులు పాల్గొన్నారు.

చెత్త కుప్పలను తొలగించాలి

పెనగలూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పెనగలూరు మండల పరిషత్ మండల రెవెన్యూ కార్యాలయాల నుంచి పోలీసుస్టేషన్ వరకు నిల్వ ఉన్న చెత్త కుప్పలను వెంటనే తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. పెనగలూరు పంచాయతీ పారిశుధ్య సిబ్బంది శనివారం వీధులను శుభ్రం చేస్తూ రెండు, మూడు షాపులకు ఓ చోట చెత్తకుప్పను ఏర్పాటు చేసి వాటిని డంపింగ్ యార్డుకు తరలించలేదన్నారు. దీంతో కొంతమంది యజమానులు చెత్త కుప్పపై పెట్రోల్, డీజిల్ లాంటివి పోసి కాల్చేశారు.

జ్యోతి దేవాలయ అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్

సిద్దవటం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శ్రీశైలం దక్షిణ ముఖద్వారంగా పేరుగాంచిన జ్యోతి సిద్దేశ్వర ఆలయాన్ని అభివృద్ధికి కృషి చేస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ అన్నారు. ఆదివారం ఆయన ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పురాతన ఆలయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం దృష్టి సారిస్తుందన్నారు. జ్యోతిలింగం, అమ్మవారి శక్తిపీఠం రెండూ కలిపి ఉన్న ప్రాంతం భారతదేశంలో శ్రీశైల బ్రమరాంబిక మల్లికార్జునస్వామి దేవస్థానమని, అనుసంధానంగా ఉన్న జ్యోతి దేవాలయాన్ని ఏడాది లోపే అభివృద్ధి చేస్తా న్నారు. కూటమి ప్రభుత్వం పురాతన ఆలయాల అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. కాగా ఆలయ భూములు దాదాపు 60 ఎకరాలు పైబడి అన్యాక్రాంతం అయినట్లు గ్రామస్థులు తెలిపారని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రీసర్వే చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు సురేష్, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, ఒంటిమిట్ట మండల బీజేపీ అధ్యక్షుడు భానుచందర్, మామిడి వెంకటరమణారెడ్డి, రాజారెడ్డి, కాకర్ల భాస్కర్‌రెడ్డి, పాల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య


ఉపేంద్ర (ఫైల్)

మదనపల్లె అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం పోతబోలు గ్రామం సిద్ధంగారి పల్లెకు చెందిన వెంకటరమణ కుమారుడు ఉపేంద్ర (35) ఆదివారం ఉదయం ఇంట్లో చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తాలుకా పోలీసుల కథనం మేరకు... ఉపేంద్ర బెంగళూరు, హైదరాబాదు, మదనపల్లెలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేసేవాడు. మూడేళ్ల క్రితం మదనపల్లె మండలం సీటీఎం గ్రామం మిట్టపల్లెకు చెందిన కృష్ణవేణిని వివాహం చేసుకున్నాడు. వీరికి 10 నెలల కుమారుడు ఉన్నాడు. ఇటీవల ఉపేంద్ర పనిమానేసి మద్యానికి బానిసయ్యాడు. శనివారం భార్య కృష్ణవేణిని అమ్మగారి ఊరు వెళ్లింది. ఆదివారం ఉదయం సిద్ధంగారిపల్లెకు వచ్చి చూడగా భర్త ఉపేంద్ర ఉరివేసుకోవడం చూసి కేకలు వేసింది. దీంతో గ్రామస్థులు తాలుకా పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం మదన పల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలుకా సీఐ కళా వెంకటరమణ పేర్కొన్నారు.

అప్పుల బాధతో టైలర్...

మదనపల్లె అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో టైలర్ వెంకటరమణ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మదనపల్లె పట్టణంలో చోటు చేసుకుంది. టూటౌన్ పోలీసుల వివరాల మేరకు మదనపల్లె పట్టణం ప్రశాంతనగర్‌కు చెందిన కొండప్ప కుమారుడు వెంకటరమణ మదనపల్లె పట్టణంలో టైలర్ షాపు నిర్వహిస్తూ చిట్స్ వేసేవాడు. ఇతనికి ఇద్దరు కుమార్తెలు. భార్య రమణమ్మతో కలిసి ప్రశాంతనగర్‌లో ఉంటున్నాడు. ఆమె ఇళ్ల నిర్మాణ పనులకు ప్రతి రోజు వెళుతోంది. ప్రతి రోజూ లాగే శనివారం పనులకు వెళ్లింది. ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో వెంకటరమణ ఉరేసుకున్నాడు. సాయంత్రం ఇంటి వచ్చిన భార్య చూసి టూటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహన్ని మదనపల్లె జిల్లా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. ఆదివారం పోర్టుమాస్టం నిర్వహించి మృతదేహన్ని బంధువులకు అప్పగించారు. ఈ మేరకు టూటౌన్ సీఐ రాజారెడ్డి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

భూ వివాదంలో మహిళకు గాయాలు

నిమ్మనపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): భూమి వివాదంలో జరిగిన ఘర్షణలో ఓ మహిళకు రక్త గాయాలు కావడంతో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. తవళం పంచాయతీ నల్లంవారిపల్లిలో సర్వే నెంబరు 549-బి-6లో 3ఎకరాల 58సెంట్ల భూమిలో అదే గ్రామానికి చెందిన పి.రెడ్డెప్ప అతని కుటుంబ సభ్యులు వ్యవసాయం చేసుకుంటున్నారు. కాగా ఇదే గ్రామానికి చెందిన పుంగనూరు భువనేశ్వరి ఆమె కుంటుబ సభ్యులు ఆ భూమి తన మామ రాజన్నకు చెందినదని, తమకు తెలియకుండా రెడ్డెప్ప తన పేరున మార్చుకొని అనుభవిస్తుండంతో కోర్టుకు వెళ్లి ఇంజక్షన్ ఆర్డరు తెచ్చుకొన్నట్లు తెలిపారు. కాగా భువనేశ్వరి పొలం వద్దకు వెళ్లి చదును చేయిస్తుండగా రెడ్డెప్ప అతని కుమారుడు సతీష్, భార్య శాంతమ్మ, చెల్లెలు రెడ్డెమ్మ తనపై కొడవలితో దాడి చేసి గాయపరచినట్లు ఫిర్యాదులో పేర్కొంది. దీంతో నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉప్పలూరులో దారి విషయంపై ఘర్షణ

- ఇరు వర్గాలకు చెందిన 12 మందిపై కేసు నమోదు

కాశినాయన, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) మండలంలోని ఉప్పలూరు గ్రామానికి చెందిన 12 మందిపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ యోగేంద్ర తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు ఉప్పలూరు ఎస్సీ కాలనీకి చెందిన ముడమాలు శిఖామణి, మాదారి రాజారత్నం కుటుంబాలు దారి విషయంపై గత కొన్ని రోజులుగా ఘర్షణ పడుతున్నారు. ఇందులో భాగంగా శనివారం ఇక్కడ నడిచేదానికి లేదంటూ దారికి అడ్డుగా శిఖామణి గోడ పెట్టాడు. గత కొన్ని సంవత్సరాలుగా ఇక్కడ నడుస్తున్నాము దారికి అడ్డుగా గోడ పెట్టవద్దంటూ రాజారత్నం మరి కొంతమంది అడ్డుచెప్పారు. ఈవిషయంపై కాలనీలోని పలు కుటుంబాలవారు రెండుగా విడిపోయి ఘర్షణ పడ్డారు. అనంతరం నర్సాపురం పోలీస్‌స్టేషన్‌లో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. పరస్పర ఫిర్యాదుల మేరకు 6 మంది చొప్పున మొత్తం 12 మందిపై కేసు నమోదు చేశామన్నారు.

శవాన్ని దొంగిలించడానికి యత్నం

- వ్యక్తిని పట్టుకొని పోలీసులకు అప్పగించిన స్థానికులు


గోతిలో పూడ్చిన శవాన్ని బయటకు తీసిన దృశ్యం

మదనపల్లె అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అంత్యక్రియలు నిర్వహించి పూడ్చిపెట్టిన ఓ శవాన్ని దొంగిలించడానికి ప్రయత్నం చేసిన ఘటన మదనపల్లె శివార ప్రాంతంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు... అంకిశెట్టిపల్లెకు వెళ్లే మార్గంలో శ్మశానం ఉంది. ఇందులో శనివారం ఓ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించి వెళ్లారు. ఆదివారం సాయంత్రం రాజస్థాన్ రాష్ట్రం జయపూర్‌కు చెందిన గోవిందు అనే వ్యక్తి మట్టిని తవ్వి గోతిలో నుంచి మృతదేహన్ని బయటకు తీస్తుండగా అటుగా వెళ్లే స్థానికులు గుర్తించారు. వెంటనే ఆ వ్యక్తిని పట్టుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. తాలుకా పోలీసులు అక్కడికి చేరుకుని నిందితున్ని విచారించారు. డెడ్‌బాడీ అవయవాల కోసం ఈ దారుణం చేస్తున్నట్లు ఒప్పుకున్నాడు. వెంటనే నిందితున్ని తాలుకా పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు తాలుకా సీఐ కళా వెంకటరమణ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


పూడ్చిన శవాన్ని దొంగలించడానికి ప్రయత్నించిన వ్యక్తిని విచారిస్తున్న పోలీసులు

కారుణ్య మరణానికి అనుమతించండి...!

- వడ్డీ వ్యాపారుల ఒత్తిళ్లు తాళలేక..
- కలెక్టర్, ఎస్పీలకు ఓ వ్యాపారి విజ్ఞప్తి
- తన ఆవేదన వ్యక్తం చేస్తూ బోర్డు ఏర్పాటు


రైల్వేకోడూరులో బోర్డు ఏర్పాటు చేసిన మోహన్‌రాజు

రైల్వేకోడూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కారుణ్య మరణానికి అనుమతించాలంటూ రైల్వేకోడూరుకు చెందిన పాత సామాన్ల (గుజరి) వ్యాపారి తాటిగొట్ల మోహన్‌రాజు జిల్లా కలెక్టర్, ఎస్పీలకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఆదివారం తన దుకాణం వద్ద తానుపడుతున్న బాధను వ్యక్త పరుస్తూ బోర్డు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రైల్వేకోడూరులో గత 20 ఏళ్లుగా పాత ఇనుప సామాన్ల వ్యాపారం చేసుకుంటూ జీవ నం సాగిస్తున్నానని తెలిపారు. గతంలో వ్యాపారం బాగానే సాగిందని, ఆ సమయంలో పది లారీలు తీసుకుని పూర్తిగా నష్టపోయి అప్పులయ్యాయని అన్నారు. రైల్వేకోడూరు పట్టణంలో వ్యాపారపరంగా మంచి పేరు సంపాదించుకున్నానని, అప్పులు చేసిన వడ్డీ వ్యాపారులకు ప్రతి నెలా వడ్డీలు సక్రమంగానే చెల్లించానని తెలిపారు. నాలుగు సంవత్సరాల క్రితం కరోనా సమయంలో వ్యాపా రం సాగలేదన్నారు. దీంతో వడ్డీ వ్యాపారుల వద్ద తీసుకున్న అప్పుకు వడ్డీలు కట్టలేక, అసలు తీర్చలేక 2021లో ఐపీ పెట్టానని తెలిపారు. తిరిగి కొద్ది కొద్దిగా వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నానని, వడ్డీ వ్యాపారులకు అప్పులు చెల్లిస్తున్నానని తెలిపారు. అయితే బాకీలు తీరుస్తున్నా వడ్డీ వ్యాపారుల వేధింపులు ఎక్కువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తనకు అనుమతి ఇస్తే కిడ్నీలు, కళ్లు, నా అవయవాలు అమ్మి వడ్డీ వ్యాపారుల బాకీలు చెల్లించే విధంగా నిర్ణయం తీసుకున్నానని తెలిపారు. నేను వడ్డీ వ్యాపారుల దగ్గర తీసుకున్న డబ్బులతో బయట ఆస్తులు తీసుకున్నానని ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు విచారణ నిర్వహించి నాకు ఎటువంటి ఆస్తులు, స్థిరాస్తులు ఉన్నా వడ్డీ వ్యాపారులకు ఇవ్వాలన్నారు. ఇది నా మరణ వాంగ్మూలంగా భావించి, తనకు న్యాయం చేయాలని కోరారు.

బోరుబావుల్లో ఉబికి వస్తోన్న భూగర్భజలం


మహానందిపల్లె సమీపంలో బోరుబావి నుంచి బయటకు వస్తున్న నీరు

కలసపాడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలతో మోటార్ స్విచ్ ఆన్ చేయకపోయినా బోరుబావుల నుంచి భూగర్భజలం ఉబికి బయటకు వస్తోంది. మండల పరిధిలోని పెండ్లిమర్రి, చెన్నారెడ్డిపల్లె, సిద్ధమూర్తిపల్లె, మహానందిపల్లె, మావిళ్లపల్లె తదితర గ్రామాల్లో బోరు బావులతో పాటు పురాతన వ్యవసా య బావులలోంచి కూడా నీరు పొంగి పొలాల్లో ప్రవహిస్తున్నాయి. గత కొన్నేళ్ల నుంచి ఇలాంటి పరిస్థితి లేదని ఒక్కసారిగా భూగర్భ జలం పెరగడం సంతోషంగా ఉన్నా, మరో పక్క భూములు ఇప్పుడే ఆరక పంట సాగుకు ఆలస్యమయ్యే ఆందోళన ఉందని రైతులు అంటున్నారు.

5న కొండయ్యస్వామి జన్మదిన వేడుకలు



మైదుకూరు రూరల్, నవంబరు 2 (ఆంధ్ర జ్యోతి): అవధూత కొండయ్యస్వామి జన్మదిన వేడుకలు ఈనెల 5వ తేదీ ఘనంగా నిర్వ హిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని ధరణి తిమ్మాయపల్లె ఊసయ్య ఆశ్రమానికి చెందిన కొండయ్యస్వామి 44వ జన్మదిన వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 5వ తేదీ ఉదయం భారీ కేకు కటింగ్ ఉంటుందని, రాత్రి జబర్దస్త్ ఆర్టిస్టులచే కార్యక్రమం, సత్య హరిచంద్ర నాటకం, 6వ తేదీ రాష్ట్రస్థాయిలో వృష భరాజములచే ప్రత్యేక బండలాగుడు పోటీలు ఉంటాయన్నారు. గెలుపొందిన ఎడ్లకు మొదటి బహుమతి రూ.3లక్షలు, రెండవ బహుమతి రూ.2లక్షలు, అలాగే పెద్ద బండలాగు పోటీలలో మొదటి బహుమతి రూ.1,58,118, రెండో బహుమతి రూ.1,08,118, మూడో బహుమతి రూ.75,118, నాల్గవ బహుమతి రూ.50,118, ఐదో బహుమతి రూ.25,118 ఉంటుందని వారు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ప్రాథమిక ఆరోగ్యం, ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ


అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్ఎస్ పీఓ శచీదేవి, విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నాగరాజు పేటలో కోటిరెడ్డి మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్యం, ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ పి.శచీదేవి మార్గదర్శకత్వంలో వలంటీర్లు వీధుల్లో ప్లకార్డులు ప్రదర్శించారు. వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యకరమైన ఆహారం, వారానికి కనీసం ఐదు రోజులు అరగంట పాటు నడక, ప్రతిరోజు పది నిమిషాల ధ్యానం వంటి అలవాట్ల ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. సీజనల్ వ్యాధులు, ఎయిడ్స్, పొగతాగడం, మద్యపానం, మత్తుపదార్థాలతో అనర్థాలపై వలంటీర్లు ప్రజల్లో అవగాహన కల్పించారు. ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ పి.శచీదేవి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.సలీంబాషా అభినందించారు.

కార్మికుల హక్కులు కాలరాస్తే ఉద్యమిస్తాం



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు

కడప నాగరాజుపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులు కాలరాస్తే ఉద్యమిస్తామని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏపీ నాగేశ్వరరావు హెచ్చరించారు. ఆదివారం యూటీఎఫ్ కార్యాలయం వద్ద సీఐటీయూ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కార్మిక హక్కులు కాలరాస్తే ఉద్యమిస్తామన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వం తానా అంటే రాష్ట్ర ప్రభుత్వం తందాన అంటోందన్నారు. కార్మిక చట్టాలు మార్చడం, 13 గంటలు పని చేయాలని ఆదేశాలు ఇవ్వడం సరైంది కాదన్నారు. అసంఘటిత రంగ కార్మికుల పరిస్థితి మరీ ఘోరమని తెలిపారు. డిసెంబరు 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు విశాఖ పట్టణంలో నిర్వహించనున్న సీఐటీయూ ఆలిండియా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి, సీఐటీయు జిల్లా కార్యదర్శులు కె.సత్యనారాయణ, వెంకటసుబ్బయ్య, ఉపాధ్యక్షులు భైరవ ప్రసాద్, జి.చంద్రశేఖర్, ఆర్.లక్ష్మిదేవి, జిల్లా కమిటీ సభ్యులు విజయ్ కుమార్, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

కడప క్రైం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఫాతిమా మెడికల్ కళాశాల సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. దినట్లు కడప ట్రాఫిక్ పోలీసుల వివరాల మేరకు... ఆదివారం చెన్నూరుకు చెందిన ఎమ్.సూర్యచంద్ర (35) ద్విచక్రవాహనంలో పులివెందల రోడ్డు వైపు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో ఫాతిమా కళాశాల సమీపంలోకి రాగానే వేగం అదుపు కాక డివైడర్‌ను ఢీకొన్నాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

డ్రాగా ముగిసిన క్రికెట్ మ్యాచ్‌లు


అష్కాన్ (కడప), తాహిర్ (కడప), మోక్షజ్ఞ (అనంతపురం)

కడప కల్చరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కడపలో వివిధ జట్ల మధ్య జరుగుతున్న ఏసీఏ అండర్ 14 మెన్స్ సబ్‌జోన్ ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లు ఆదివారం డ్రాగా ముగిశాయి. వివరా లిలా..

నగర రిమ్స్ సమీప వైఎస్ రాజా రెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో కర్నూలు-కడప జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలు త బ్యాటింగ్ చేసిన కర్నూలు జట్టు 69.5 ఓవర్లలో 125 పరుగులకు ఆలౌట్ అయిన సంగతి తెలిసిందే. ఇందుకు ప్రతిగా బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 24 ఓవర్లలో మొదటిరోజు ఆట ముగిసే సమయానికి రెండు వికెట్లు కోల్పోయి 68 పరుగులు చేసింది. ఇందులో అషాన్ 31 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో ఉన్నారు. ఓవర్ నైట్ స్కోరు 68 పరుగులతో రెండోరోజైన ఆది వారం బ్యాటింగ్ చేపట్టి 89.3 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 249 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఇందులో తాహిర్ 63 పరుగులు చేశారు. దీంతో కడప జట్టుకు 124 పరుగుల ఆధిక్యత లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ దిగిన కర్నూలు జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 31 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 58 పరు గులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసినట్లు నిర్వాహకులు వెల్లడించారు.

కేవోఆర్ఎం క్రికెట్ మైదానంలో అనంతపురం-నెల్లూరు జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన నెల్లూరు జట్టు 58.5 ఓవర్లలో 186 పరుగులకు ఆలౌట్ అయిన సంగతి తెలిసిందే. ఇందుకు ప్రతిగా బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో మొదటిరోజు ఆట ముగిసే సమయానికి 37 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 86 పరుగులు చేసింది. కాగా ఓవర్‌నైట్ స్కోరు 86 పరుగులు తిరిగి రెండ రోజు ఆదివారం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు మొత్తంగా 83.4 ఓవర్లలో 242 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో అనంతపురం జట్టుకు 56 పరుగుల ఆధిక్యత లభించింది. ఇందులో మోక్షజ్ఞ తేజ 84 పరుగులు చేయడం విశేషం. అనంతరం రెండో ఇన్నింగ్స్ దిగిన నెల్లూరు జట్టు ఆట ముగిసే సమయానికి 45 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 159 పరుగులు చేసింది. ఇందులో షామీర్ 59 పరుగులు చేశాడు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసినట్లు నిర్వాహకులు వెల్లడించారు.

టెట్ మినహాయింపు ఇవ్వాలి.. ఆపస్


మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు వివరిస్తున్న ఆపస్ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలని ఆపస్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్‌లో పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుని ఆపస్ జిల్లా బృందం కలిసింది. సర్వీస్ రూల్స్ సాధనలో ఆయన చేసిన సహకారానికి కృతజ్ఞతలు తెలుపుతూ, పూర్తిస్థాయిలో సర్వీస్ రూల్స్ అమలు కావడానికి కృషిచేయాలని కోరింది. అలాగే 2010కి ముందు నియమితులైన ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులను టెట్ ఉత్తీర్ణత నుంచి మినహాయించేలా కేంద్రం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. సుప్రీంకోర్టు తాజా తీర్పుకారణంగా ఉపాధ్యాయుల్లో ఆందోళన నెలకొందని ఆపస్ నేతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్రకార్యదర్శులు వెంకటరామిరెడ్డి, సుబ్బరాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు, చంద్రమోహన్, బాలకృష్ణుడు, రఘుప్రసాద్, రెడ్డయ్యరెడ్డి, నాగమునీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రుడికి వెండి బిస్కెట్ వితరణ


వితరణ చేస్తున్న కర్ణాటక భక్తుడు

రాయచోటిటౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలో వెలిసిన భద్రకాళీ సమేత వీరభద్రస్వామికి ఆదివారం కర్ణాటక రాష్ట్రం బెంగళూరు నివాసి వై.వీరప్ప ఒక కేజీ వెండి బిస్కెట్ బహుకరించారు. దాతలకు ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు అర్చనలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

నాగనాథేశ్వరుని కొండపైకి వాహనాలు బంద్

- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీ
- భక్తులు సహకరించాలి : సీఐ


పార్కింగ్ స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ వంశీధర్, చైర్మన్ సుమన్‌రెడ్డి

ఖాజీపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం రెండవ సోమవారం పురష్కరించుకుని తెల్లవారుజామునుంచే నాగనాథేశ్వరుని దర్శించుకునేందుకు భారీగా భక్తులు కొండ పైభాగానికి చేరుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేస్తారు. అయితే కొండ పైభాగంలో ఎక్కువ పార్కు చేసే స్థలం లేనందున వాహనాలను కింది భాగంలో నిలిపివేస్తు న్నట్లు సీఐ వంశీధర్ తెలిపారు. ఆదివారం కొండ కింది భాగంలో పార్కింగ్ స్థలాన్ని పరిశీలించి అనంతరం సీఐ మాట్లాడుతూ కార్తీక మాసంలో సోమవారం మాత్రమే వాహనాలు పైకి అనుమతించబడవని, భక్తులు సహకరించాలని కోరారు. కాగా, కొండ కింది భాగం నుంచి పైకి వెళ్లడానికి ఆటోలు ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ సుమన్‌రెడ్డి అన్నారు. లేదంటే కాలి మార్గాన కొండ పైకి వెళ్లవచ్చన్నారు. భక్తుల కోసం కొండ కింది భాగంలో భారీగా అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

వైవీయూ విద్యార్థుల బొటానికల్ టూర్

కడప ఎడ్యుకేషన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వైవీయూ వృక్షశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ చంద్ర ఓబులరెడ్డి, ప్రొఫెసర్ ఎ.మధుసూదనరెడ్డి పర్యవేక్షణలో విద్యార్థులు ఆదివారం కోయంబత్తూర్ ఫారెస్ట్ రీసెర్చ్ ఇన్ స్టిట్యూట్, తమిళనాడు అగ్రికల్చర్ యూనివర్సిటీ, బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియాను సందర్శించారు. ఊటీ ప్రభుత్వ బొటా నికల్ గార్డెన్, దోబబెట్ట ప్రాంతాల్లో అరుదైన మొక్కలను సేకరించి, నమోదు చేసుకున్నారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
తిరుపతి - 9703618708, 9030367786
9703618705, 9703618710
9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లె - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

హెల్త్ కేర్
డా॥కె.కీర్తన(M.D., Pediatrics, SVMS &Ex Senior Resident, RUIA, Fellow in Neonatology) పుట్టిన బిడ్డలు & చిన్న పిల్లల వైద్యనిపుణులు. 24X7 ఎమర్జెన్సీ కేసులు చూడబడును. శ్రీ విష్ణు చిన్న పిల్లల హాస్పిటల్, మనోహరి హాస్పిటల్ ప్రక్కన, రెడ్డి & రెడ్డికాలనీ, తిరుపతి. సెల్: 63035 53359
AJT -1777

WANTED
నవయుగ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో A.P.ఆగ్రోస్ ప్లాంట్ నందు ఆర్గానిక్ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లో మార్కెటింగ్ మేనేజర్లు, సూపర్‌వైజర్లు, వర్కర్స్, యువతీ, యువకులు మరియు 65 సం.లోపు రిటైర్డ్ ఉద్యోగులు కావలెను. Q: 10+2 పైన Age: 20-60 జీతం : 15 వేలు నుంచి 30 వేలు. A.P. ఆగ్రోస్, తిరుచానూరు మ్యాంగో ఫ్రూట్ మార్కెట్, తిరుపతి. www.navayuga.org, Cell : 93928 77588, 99662 11553.
AJT -1779

PLOTS FOR SALE
Investment Plots | Farm House Plots | Villa Plots for Sale : Lucky Ventures (India's No.1 Real Estate Company). Cell : 91145 61456
AJT - 1771

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టు మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర:7382114647.
AJA- 246990

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్

పాఠకులకు ముఖ్యగమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

రెడ్డెమ్మతల్లికి ప్రత్యేక పూజలు



గుర్రంకొండ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): సంతానలక్ష్మీగా పేరుగాంచిన రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం అమ్మవారిని పరిమళభరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి శాస్త్రోక్తంగా పూజలను నిర్వహించారు. వివిధ ప్రాంతాల మహిళలు అమ్మవారి చెంత సంతానం కోసం వరపడ్డారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయ పరిసరాలు భక్తులతో రద్దీగా మారాయి. కార్యక్రమంలో చైర్మన్ రాజన్న నాయుడు, ఈఓ మంజుల సిబ్బంది పాల్గొన్నారు.

పీలేరులో కంచి పీఠాధిపతి



భక్తులను ఆశీర్వదిస్తున్న విజయేంద్ర సరస్వతి స్వామి

పీలేరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి స్వామి వారు ఆదివారం పీలేరులో భక్తులను ఆశీర్వదించారు. కడప నుంచి తిరుపతికి వెళుతున్న ఆయన పీలేరులోని బ్రాహ్మణ సంఘం అభ్యర్థన మేరకు కాసేపు ఆగారు. భక్తులకు పండ్లు, కుంకుమ, విభూది, ప్రసాదాలు అందించారు. బ్రాహ్మణ సేవా సంఘ అధ్యక్ష, కార్యదర్శులు తెనాలి శేషగిరిరావు, ఉద్యా ఫణీంద్ర శర్మ, విరూపాక్షం కాశీనాథ్, సూత్రం కిరణ్ కుమార్, ఆలూరు నాగేశ్వర శర్మ, విరూపాక్షం శ్రీనివాస శాస్త్రి, దుర్గా గ్యాస్ అధినేత అమరనాథ్, వారణాశి మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

16న బ్రాహ్మణ కార్తీక వనభోజన మహోత్సవాలు



సమావేశంలో పాల్గొన్న బ్రాహ్మణ సంఘం సభ్యులు

మదనపల్లె అర్బన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఈ నెల 16న తేదీ ఆదివారం శంకర బ్రాహ్మణ సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో నిమ్మనపల్లె రోడ్డు, కేశవరెడ్డి స్కూల్ సమీపంలోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం ప్రాంగణంలో బ్రాహ్మణ కార్తీక వనభోజన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు కోదండరామయ్య తెలిపారు. ఆదివారం శంకరబ్రాహ్మణ సేవా సహకార సంఘ భవనంలో బ్రాహ్మణులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ బ్రాహ్మన వనభోజనంలో ప్రతి ఒక్కరూ బ్రాహ్మనోత్తములు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో శివశంకరం, శర్మ, ప్రకాష్, నాగభూషణరావు, కేశవాచారి. రాజారావు, శరత్‌బాబు, రఘునందన, మధు, తదితరులు పాల్గొన్నారు.

అందరికీ సంక్షేమం - ప్రతి ఊరూ అభివృద్ధి

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మద్దిరెడ్డి కొండ్రెడ్డి



కుక్కరాజుపల్లె గ్రామంలో స్థానికులతో మాట్లాడుతున్న టీడీపీ నేత కొండ్రెడ్డి

తంబళ్లపల్లె, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మద్దిరెడ్డి కొండ్రెడ్డి అన్నారు. ఆదివారం టీడీపీ నేతలతో కలిసి మండలంలోని కుక్కరాజుపల్లె, కోటకొండ గ్రామాల్లో పర్యటించిన ఆయన ప్రజలకు అందుతున్న సూపర్ సిక్స్ పథకాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలు గ్రామాల ప్రజలు ఫించన్లు, రేషన్‌కార్డులు, ఇళ్ల స్థలాలు, సిమెంటు రోడ్లు, కాల్వలు తదితర సమస్యలను తెలియచేయగా సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట టీడీపీ నేతలు, కార్యకర్తలు సిద్దారెడ్డి, షామీర్, సుబ్బారెడ్డి, వెంకట్రమణ, చిన్నరెడ్డి ఉన్నారు.

రెవెన్యూ డివిజన్‌కు న్యాయవాదుల మద్దతు



దీక్షలకు మద్దతు పలుకుతున్న పీలేరు బార్ అసోసియేషన్ సభ్యులు

పీలేరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పీలేరులో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని పీలేరు బార్ అసోసియేషన్ నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీలేరులో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని రెవెన్యూ డివిజన్ సాధన సమితి రిలే దీక్షలకు ఆదివారం న్యాయవాదులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా ప్రముఖ న్యాయవాది, బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు చంద్రశేఖర రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నప్పటి నుంచీ కేవలం నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే పీలేరు అభివృద్ధి చెందిందన్నారు. అంతకుముందు, ఆ తరువాత ఏ ప్రభుత్వమూ పీలేరును పట్టించుకోలేదన్నారు. మదనపల్లె జిల్లా ఏర్పడుతున్న తరుణంలో పీలేరులో రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు అన్ని అనుకూలతలు ఉన్నా ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన రాకపోవడం విచారకరమన్నారు. వైసీపీ ప్రభుత్వంలోనూ పీలేరును రెవెన్యూ డివిజన్ ఏర్పాటులో అన్యాయం జరిగిందన్నారు. రిలే దీక్షలకు న్యాయవాదులు, మదనపల్లె జిల్లా సాధన సమితి, బిస్మిల్లా ఆటో యూనియన్, వైసీపీ కార్మిక విభాగం నేతలు మద్దతు పలికారు. అన్ని అర్హతలున్న పీలేరును రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. వేర్వేరు కార్యక్రమాల్లో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బీసీ పురుషోత్తం రెడ్డి, వల్లెపు చిన్నరెడ్డప్ప, మదనపల్లె సాధన సమితి కన్వీనర్ పీటీఎం శివప్రసాద్, వైసీపీ కార్మిక సంఘం నేతలు షబ్బీర్, చిన్నయల్లప్ప, మునీర్, దావూద్, రమేశ్ రెడ్డి, రియాజ్, తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో బ్రహ్మంగారి జయంతి



బ్రహ్మంగారి పూజల్లో పాల్గొన్న భక్తులు

బి.కొత్తకోట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): బీరంగి గ్రామంలో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి జయంత్యుత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆరేళ్లుగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవం ఈమారు కూడా భక్తిశ్రద్ధలతో జరిపారు. ఉదయం 6గంటల నుంచి గోపూజతో మొదలుకుని అన్నమయ్య కీర్తనలు, భజనలు, కోలాటాలు భక్తులను ఆకట్టుకున్నాయి. వెంకటేష్ స్వామి ఆధ్వర్యంలో అన్నసంతర్పణ రాత్రి వరకు కొనసాగింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి జనం పెద్దఎత్తున పాల్గొన్నారు.



తుంపర్లకు దెబ్బతిన్న టమోటా తోట

'టమోటా'కు తుంపర్ల దెబ్బ

రైతును ముంచిన 'మొంథా' ● తోటల్లోనే రాలిపోతున్న టమోటాలు

నష్టాల బాటలో రైతన్నలు ● నాణ్యత లోపంతో ధరలు పతనం

గుర్రంకొండ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రైతులు సాగుచేసే టమోటా పంటకు ధర వచ్చిందంటే దిగుబడి ఉండదు. ఆశించినంత దిగుబడి వస్తే ధరలు పడిపోతాయి. లేదంటే తెగుళ్ల ఆశించడం, ప్రకృతి కన్నెర్ర చేయడంతో రైతన్నలు పంట నష్టపోయి అప్పుల ఊబిలో చిక్కుకుపోతున్నాడు. దీంతో రైతులు నష్టాలను చవిచూస్తున్నారు. వ్యవసాయంలో రైతన్నలు సాగు చేసిన పంటలకు దెబ్బ మీద దెబ్బపడుతోంది. రైతన్నల కష్టాలు తీరుతాయనుకున్న సమయంలో వరుణుడు దెబ్బ రైతుల పాలిట శాపంలా మారింది. దీంతో సాగు చేసిన పంటలు నుంచి దిగుబడి పొందకుండానే కాయలు నేల రాలిపోతున్నాయి. దీంతో పంట సాగు ఖర్చు చేసిన పెట్టుబడులు కూడా చేతికందే పరిస్థితి లేక రైతులు విలవిల్లాడుతున్నారు. వివరాల్లోకెళితే....

పడమటి మండలాల్లో రైతన్నలు ఎక్కువగా టమోటా పంటను సాగు చేస్తారు. ఈ టమోటా పంట ఎకరా పొలంలో సాగు చేయాలంటే రైతుకు లక్షలాది రూపాయలు ఖర్చు అవుతుంది. టమోటా పంట నాటింది మొదలు దిగుబడి వచ్చే వరకు ఎకరా పొలానికి రూ. 2.50 లక్షలు ఖర్చు అవుతోంది. టమోటా పంటకు ధరలు పలికితే రైతులు ఆదాయం పొందుతున్నారు. ధరలు పతనమైతే అప్పుల బాటలో పయనిస్తున్నారు. కొన్ని నెలలుగా టమోటా పంటకు ఆశాజనకంగా ధరలున్నాయి. ఈ క్రమంలో పడమటి మండలాల్లో రైతులు వేలాది ఎకరాల్లో టమోటా పంటను సాగు చేశారు. టమోటా పంట సాగుకు కోట్లాది రూపాయలను ఖర్చు చేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో టమోటా ధరలు కిలో రూ.25 నుంచి 30 వరకు పలుకుతోంది. ఈ లెక్కన 25 కిలోల టమోటా క్రేట్ ధర రూ.500 నుంచి 700 వరకు పలుకుతోంది. ఈ ధరలున్న రైతులు పంట సాగు ఖర్చు పోను కొంత మేర అప్పుల నుంచి బయట పడతారు. ఈ క్రమంలో నాలుగు రోజుల పాటు కురిసిన తుంపర్లకు టమోటా తోటలు దెబ్బతిన్నాయి. దీంతో టమోటా తోటల్లో కాయలు రాలిపోతున్నాయి. కాయలు రాలిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.


తుఫాన్‌తో నష్టపోయా



పొలం లీజుకు తీసుకుని ఆరెకరాల్లో టమోటా పంటను సాగు చేశా. ప్రస్తుతం పంట దిగుబడి ప్రారంభమైంది. సాగుకు సుమారు రూ.15 లక్షలు ఖర్చు చేశా. ఈ క్రమంలో మొంథా తుఫాన్ కారణంగా కురిసిన తుంపర్లకు టమోటా పంట పూర్తిగా దెబ్బతినింది. తుంపర్లతో కాయలు దెబ్బతిని నేల రాలిపోయాయి. తోటలో ఉన్న కాయలు కూడా నాణ్యత లేకపోవడంతో తక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్నారు. సాగు పెట్టుబడులు కూడా చేతికందేలా లేవు.

రెడ్డి మోహన్, టమోటా రైతు, గుర్రంకొండ

నాణ్యత లోపంతో ధరలు పతనం



ఇటీవల కురిసిన తుంపర్లకు టమోటా పంటలు దెబ్బతిన్నాయి. ఈ తుంపర్లకు టమోటా తోటల్లో ఆకులు రాలిపో ం ు ు కాయల పై నల్లమచ్చలు ఏర్పడ్డాయి. టమోటా కాయలకు మచ్చలు రావడంతో మార్కెట్‌కు తీసుకెళ్లినా కొనేవారు తక్కువ ధరలు కొనుగోలు చేస్తున్నారు. నాణ్యత కాయలకు మంచి ధరలుంటే మచ్చలున్న కాయలు సగం ధరలు కూడా పలకడం లేదు. దీంతో దిగుబడి ఉన్నా రైతులు తుంపర్ల దెబ్బకు తీవ్రంగా నష్టపోయారు.

వైరస్‌తో నాణ్యత లోపిస్తోంది



ఇటీవల కురిసిన మొంథా తుఫాన్‌తో టమోటాకు చీడ పీడలు ఎక్కువయ్యాయి. పంటలో కాయలు నాణ్యత లోపించకుండా ఉండేందుకు వేలాది రూపాయలు ఖర్చు చేసి మందులను పిచ్చికారీ చేయాల్సివస్తోంది. ఇంత చేసినా కాయలపై మచ్చలు ఏర్పడుతున్నాయి. దీంతో మచ్చలు పడిన కాయలను వ్యాపారులు తక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్నారు. తుఫాన్‌తో టమోటా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

విజయేంద్ర నాయుడు, టమోటా రైతు, సరిమడుగు



టమోటా కాయలపై ఏర్పడిన మచ్చలు

అభివృద్ధికి శాపం - ఎవరిదీ నిర్లక్ష్యం



కుషావతినది ప్రవాహానికి ప్రజల రాకపోకలు స్తంభించిన దృశ్యం



వర్షకాలంలో కుషావతినది ప్రవాహానికి ప్రజల ఇక్కట్లు (ఫైల్ ఫొటోలు)

పెద్దమండ్యం, నవంబరు 2(ఆంధ్రజ్యో తి) తంబళ్లపల్లి నియోజక వర్గంలోని పెద్దమండ్యం మండల కేంద్రంలో దశా బ్దాలుగా రెండు ప్రధాన సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పెద్దమండ్యంలో మౌలిక సదుపాయ కల్పనలో పాలకులు విఫలమయ్యారు. ఆ సమస్యలు ఎండకాలం, వర్షాకాలం లోనే తీవ్రంగా ఇబ్బందులు పడుతు న్నారు. టీడీపీ హయాంలోనే పెద్దమం డ్యం కొంతమేర అభివృద్ధి సాధించింది. పెద్దమండ్యంలో బస్‌స్టాండ్ నిర్మాణం, పెద్దమండ్యం సమీప కుషావతినదిపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ప్రజలు ఆవేదనలు, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కారణం మండల కేంద్రంలో బస్‌స్టాండ్ లేక ప్రయాణీకులు నిలుచున్న చోటే బస్‌స్టాండ్. ఇక్కడ బస్సులు వచ్చేంత వరకు రోడ్డు పక్కన ప్రయాణీకులు నిలబడి వేచి వుండాల్సిందే. ఈ ఇబ్బందులు తీర్చాలని పెద్ద మండ్యంలో బస్‌స్టాండ్ నిర్మాణం చేపట్టాలని ప్రజలు దశాబ్దాల తరబడి ప్రజాప్రతినిధులకు, ఆర్టీసీ అధికారులకు విన్నవించుకున్నారు. దీంతో అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రతిపాదనలతో మూడేళ్లగా పెద్దమండ్యంలో బస్‌స్టాండ్ నిర్మాణం పనులు చేపట్టినా ఇప్పటి వరకు బస్‌స్టాండ్ నిర్మాణాలు పూర్తి చేయలేకపోతున్నారని విమర్శలొస్తున్నాయి. దీనికి రాజకీయ గ్రహణం పట్టింది. బస్‌స్టాండ్ లేక ప్రయాణీకులు నరకయాతన పడుతున్నారు. మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలతో ప్రయాణంలో రోడ్లపైన నిలుచుకుని బస్సులు వచ్చేంత వరకు వేచి చూడాల్సి వస్తోందని మహిలు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షకాలం, ఎండకాలంలో ప్రయాణీలకు పలు ఇక్కట్లకు గురవుతున్నారు. కనీసం మరుగుదొడ్లు లేక మహిళల, చిన్న పిల్లలు బాధలు చెప్పలేమని ప్రయాణీల ఆవేదన వ్యక్తం చేశారు. కాగా పెద్దమండ్యం - గుర్రంకొండ రహదారి పెద్దమం డ్యం సమీప కుషావతినది ప్రవా హ ఉధృతికి ఏటా వర్షకాలంలో వాహనాలు, ప్రజల రాకపోకలు స్తంభించిపోతాయి. నాలుగేళ్ల కింద ట తరిగొండ-గుర్రంకొండ, పెద్ద మండ్యం డబల్‌రోడ్డు నిర్మాణంలో మంజూరైన బ్రిడ్జి కూడా నిర్మాణం చేపట్టలేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ బ్రిడ్జి నిర్మా ణం నిర్మించాలని కొనేళ్లగా ప్రజలు కోరుతున్నారు. అర్‌అండ్‌బీ అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఈ సమస్యను పట్టించుకోలేదని విమర్శలొస్తున్నాయి. గత ఎన్నికల ముందుగా పెద్దమండ్యం మండల జనసేన పార్టీ ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాన్‌కు పెద్దమండ్యం బ్రిడ్జి ఇబ్బందులు, సమస్యలపై ఆ పార్టీ నేతలు విజయవాడలో వివరించారు. గత వర్షాలకు కుషావతినది నీటి ప్రవాహంలో దాటుతున్న బొలెరో వాహనం బోల్తాపడి ఒకరు మృతి చెందారు. పెద్దమండ్యంలో బ్రిడ్జి, బస్‌స్టాండ్ లేకపోవడంతో రోజూ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుని బస్టాండ్, బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టి ప్రజా కష్టాలు తీర్చాలని ప్రజలు కోరారు.

నెట్‌బాల్ పోటీలకు వెంకట విశ్వసాయి ఎంపిక



మదనపల్లె, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): నెట్‌బాల్ పోటీల్లో మదనపల్లె విద్యార్థి ప్రతిభ కనబరిచాడు. మదనపల్లె పట్టణం దేవతానగర్‌కు చెందిన మున్సిపల్ కాంట్రాక్టు ఉద్యోగి వై.శివప్రసాద్ కుమారుడు వై.వెంకటవిశ్వసాయి తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. ఇందులో భాగంగా వాల్మీకిపురం మండలం కొత్త మంచూరులో శనివారం జరిగిన పోటీల్లో రాష్ట్ర స్థాయి అండర్-17 నెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. పాఠశాల ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు, పీడీ కమలేష్, విద్యార్థి తల్లిదండ్రులు వై.శివప్రసాద్, సి.వరలక్ష్మిని అభినందించారు.

5న ఝరికోనలో లక్ష దీపోత్సవం

కలకడ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఝరికోనలో బుధవారం లక్ష దీపోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వహకులు ఎం. తిప్పారెడ్డి, వై. శ్రీనివాసులు, శివమాల పీఠ భక్త బృందం వారు తెలిపారు. ఈ సందర్భంగా ఆరోజు సాయంత్రం రుద్రాభిషేకం, కళ్యాణోత్సవం, సైకతలింగ పూజ, బిల్వార్చన, లక్షదీపోత్సవం, కార్తీక దీపారాధన, కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరుగుతాయన్నారు. తదుపరి దాతలచే అన్నదాన వితరణ వుంటుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై సిద్ధేశ్వరుడి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

డైరెక్టర్‌కు అభినందనోత్సవం

మదనపల్లె అర్బన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఏపీ విద్య సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ వుయ్యాల శ్రీనివాస్ అభినందనోత్సవం నిర్వహించారు. ఏపీ విద్య సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్, జనసేన రాష్ట్ర ఐటీ కో-ఆర్డినేటర్ శ్రీనివాస్‌ను ఆదివారం పలువురు అభినందించారు. చిత్తూరులో నిర్వహించిన కార్యక్రమంలో మదన పల్లె జనసేన పార్టీ ఇన్‌చార్జ్, జనసేన రాయలసీమ కో- కన్వీనర్ గంగారపు రాందాస్ చౌదరి, మదనపల్లె ఏఎంసీ ఛైర్మన్ జంగాల శివరాం రాయల్, రాష్ట్ర ఐటీ విభాగం నేతలు లక్ష్మీనారాయణ, మదనపల్లె రూరల్ అధ్యక్షుడు బాబు, ఉమ్మడి చిత్తూరు జిల్లా జాయింట్ సెక్రటరీ గజ్జల రెడ్డెప్ప పాల్గొన్నారు.

జనసేనలోకి వందమందికిపైగా చేరిక



మైఫోర్స్ మహేష్ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన యువకులు

మదనపల్లె అర్బన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో వంద మందికిపైగా యువకులు జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, ఏపీఐఐసీ డైరెక్టర్ మైఫోర్స్ మహేష్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. పార్టీ కార్యాలయంలో యువకులకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. మై ఫోర్స్ మహేష్ మాట్లాడుతూ ఏపీలో రాష్ట్రాభివృద్ధి తోపాటు సమాజంలో మంచి విలువలతో కూడిన రాజకీయం కేవలం జనసేన పార్టీతో పవన్ కళ్యాణ్ నాయకత్వంలో సాధ్యమన్నారు. భవిష్యత్‌లో పార్టీని బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు బలోపేతం చేయడమే లక్ష్యమన్నారు. నేతలు విద్యాసాగర్, రమణ, నిఖిల్, బెన్నీ, హేమంత్, లీలేష్, ప్రవీణ్‌నాయుడు, శివ, నోయల్, సమీర్ పాల్గొన్నారు.



వాల్మీకిపురం, నవంబరు2(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న వర్షాలు, మొంథా తుఫాను కారణంగా రోడ్లు చెరువులు, వాగులను తలపిస్తున్నాయి. పట్టణంలోని తరిగొండ రోడ్డు వెంగమాంబ ఆర్చి సమీపంలో డ్రైనేజీ నిర్మాణం జరిగినా కాసింత వర్షం కురిస్తే చాలు చెరువును తలపిస్తూ రోత పుట్టిస్తోంది. వాహనాల రాకపోలకు సైతం తీవ్ర ఇబ్బందికరంగా తయారవడం గమనార్హం. తిరుపతి రోడ్డులోని పెట్రోల్ బంక్ సమీప రహదారిపై ఏర్పడ్డ గోతుల్లో వర్షపు నీరు చేరి వాహన చోదకులకు తిప్పలు తప్పడం లేదు. ఈ ప్రాంతంలో తాత్కాలిక పనులతో సరిపెట్టుకుంటున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పట్టణంలోని నాయక్‌వీధిలో నాలుగు చినుకుల వర్షానికే రోడ్డుపై వర్షపు నీటితో దుర్గంధం భరితంగా తయారవుతూ రోత పుట్టిస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారులపై దృష్టి సారించి సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుకుంటున్నారు.





తిరుపతి రోడ్డులోని పెట్రోల్ బంకు వద్ద రోడ్డు గుంతలమయం - నాయక్‌వీధిలో రోడ్డుపై వర్షపునీరు (ఫైల్‌ఫొటో)

ఒకేషనల్ కోర్స్‌తో ఉపాధి

రామాపురం, నవంబరు2(ఆంధ్రజ్యోతి): ఒకేషనల్ కోర్స్‌తో ఉపాధి అవకాశాలను మెండుగా ఉన్నాయని కేజీబీవీ ప్రిన్సిపాల్ పుష్పలత అన్నారు. కేజీబీవీలో చదువుతున్న 9, 10, 11, 12 విద్యార్థినులకు ఆదివారం ప్రిన్సిపాల్ అధ్యక్షతన ఇండస్ట్రియల్ సందర్శన, ఫుడ్ ప్రాసెసింగ్ ట్రాక్‌పై కార్యక్రమం నిర్వహించారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాల డైరీలను సందర్శించారు.

ప్రకృతి సేద్యంతో బహుళ ప్రయోజనాలు

లక్కిరెడ్డిపల్లె,నవంబరు2(ఆంధ్రజ్యోతి): ప్రకృతి సేద్యంతో బహుళ ప్రయోజనాలు లభిస్తాయని ప్రాజెక్టు మేనేజర్ వెంకటమోహన్ పేర్కొన్నారు. ఆదివారం గార్లపల్లెలో జైశ్రీరామ్ డీఆర్సీ బయోరిసోర్స్ సెంటర్ ఏర్పాటు చేశారు. ప్రకృతి వ్యవసాయ వనరుల విత్తనాల కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. సందర్భంగా మాట్లాడుతూ రబీ ఖరీఫ్ సీజన్‌లకు ప్రధాన పంటలు ఆర్డీఎస్ విత్తనాల కి ట్లు అందుబాటులో ఉన్నాయని, రబీకి వేరుశనగ అందుబాటులో ఉన్నాయని ఆయన తెలియజేశారు. రైతులు ఆర్డీఎస్ సీడ్ కిట్లను సజీలం చేసుకోవాలన్నారు. వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ వెంకట్రమణ, సరస్వతి, చంద్రమోహన్‌రెడ్డి, గంగిరెడ్డి, లక్ష్మీదేవి, నాగమణి, రైతులు పాల్గొన్నారు.

అమ్మవారికి పూజలు

సిద్దవటం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మూలపల్లె క్రాస్ వద్ద వెలసిన ఇరుగులమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అర్చకులు సి.రమణయ్య మాట్లాడుతూ అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకాలు, సిద్దవటం ఆకులవీధి వాసి సిరిగిరి సుధాకర్ కుటుంబీకులు భక్తులకు అన్న ప్రసాదాలు ఏర్పాటు చేశారన్నారు.

క్రికెట్ జట్టు విజయం సాధించాలి

రైల్వేకోడూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రపంచ కప్ వన్డే మహిళా భారత క్రికెట్ పోటీల్లో భారత జట్టు విజయం సాధించాలని ప్రత్యేక పూజలు చేశారు. చర్చిలో రాష్ట్ర గ్రీనరీ, బ్యూటిఫికేషన్ డైరెక్టర్ పుల్లెల రమేష్‌బాబు ప్రార్థనలు చేశారు. దేవాలయాలు, మసీదుల్లో పూజలు చేశారు. చంద్రమౌళి, తిమోతి, నరిగి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.